www.bhadradrinews.com

భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily

కూతురే కొడుకై.. కన్నతండ్రికి అంతిమ సంస్కారాలు...



6 లో..

కందులవారి వాగు వద్ద పైపులు మాయం!



5 లో..

హైదరాబాద్, సంపుటి : 4 సంచిక: 269, గురువారం 29-10-2026 ఎడిటర్ : చెంగపొంగు సైదులు పేజీలు : 6 వేల : 5

Published from Khammam,Circulated by Hyderabad, Karimnagar, adilabad, Nizamabad, Warangal, Nalgonda, Mahabubnagar, Khammam



నీటి నాణ్యతపై

ఎక్కడా రాజీ పడవద్దు

ట్రీటెడ్ వాటర్‌పై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష

హైదరాబాద్, అక్టోబర్ 28:

హైదరాబాద్ క్యూర్ పరిధిలో తాగు నీటి సమస్య రాకూడదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. భవన నిర్మాణాలకు, మొక్కలు, గార్డెనింగ్ వంటి అవసరాలకు శుద్ధి చేసిన నీటినే వినియోగించాలని సీఎం ఆదేశించారు. ట్రీటెడ్ వాటర్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ప్రైవేట్ ఎస్టీపీల ఏర్పాటును ప్రోత్సహించాలని, డేటా సెంటర్లకూ శుద్ధి చేసిన నీటినే సరఫరా చేయాలని సీఎం ఆదేశించారు. హైదరాబాద్ కోర్ అర్బన్‌లో ఎట్టి పరిస్థితుల్లోనూ తాగు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను రేవంత్ రెడ్డి ఆదేశించారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. క్యూర్ ఏరియాలో మంచినీటి సరఫరా, ఎస్టీపీల నిర్మాణం, ట్రీటెడ్ వాటర్ వినియోగంపై ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్‌లో రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఎల్‌నినో నేపథ్యంలో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని, క్యూర్ ఏరియాలోని మురుగునీటి శుద్ధి కేంద్రాలు, ఎస్టీపీలు వంద శాతం సామర్థ్యంతో పనిచేసేలా చూడాలని సీఎం ఆదేశించారు. సెక్రటేరియట్‌తోపాటు సీఎంవో, అవుటర్ రింగ్, మైట్రో రైల్, ఇతర శాఖల కార్యాలయాల్లో పచ్చదనం నిర్వహణ, ఇతర అవసరాలకు శుద్ధి చేసిన నీటిని వినియోగించేలా చూడాలని సీఎం సూచించారు. పబ్లిక్ పార్క్‌లు, రోడ్ల శుభ్రతకు కూడా ట్రీటెడ్ వాటర్‌నే వాడాలన్నారు. భవన నిర్మాణంలో శుద్ధి చేసిన నీటినే వాడాలనే నిబంధనను కచ్చితంగా అమలు చేయాలని సీఎం స్పష్టం చేశారు. ప్రైవేట్ ఎస్టీపీల ఏర్పాటును ప్రోత్సహించాలని, డేటా సెంటర్లకూ శుద్ధి చేసిన నీటినే సరఫరా చేయాలని సీఎం ఆదేశించారు.

కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు

ముందస్తు ప్రణాళికలతో సిద్ధం

- తాగు, సాగునీరు విద్యుత్ కొరత రాకుండా పకడ్బందీ చర్యలు
- అఖిలపక్షంతో కలిసి ఢిల్లీకి వెళ్లి రాష్ట్రానికి రావాల్సిన సహాయాన్ని సాధిద్దాం
- విపత్తు వేళ రాజకీయాలకు అతీతంగా ముందుకు వెళ్దాం
- అఖిలపక్షం లేవనెత్తిన అంశాలను ప్రభుత్వం పరిగణలోకి తీసుకుంటుంది
- తీవ్రమైన అంశంపై చర్చిస్తున్న నేపథ్యంలో సీఎం గైర్హాజరు పట్ల విమర్శలు



హైదరాబాద్, అక్టోబర్ 28 :

ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై రాష్ట్ర సచివాలయంలో బుధవారం అఖిలపక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కాంగ్రెస్‌తో పాటు బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం, సీపీఐ, సీపీఎం, టీజేఎస్, ఎస్పీ, ఆర్జేడీ, బీఎస్పీ, ఆప్, టీడీపీ పార్టీల ప్రతినిధులు, రైతు కమిషన్ చైర్మన్, మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొని విలువైన సూచనలు అందించారు.రాష్ట్రంలో ఏర్పడిన వర్షాభావ పరిస్థితులను అధిగమించేందుకు ప్రజా ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉందని ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ వివరించారు. విపత్తు వేళ రాజకీయ విమర్శలకు తావులేకుండా, ప్రజా ప్రయోజనాలే పరమావధిగా అన్ని పార్టీలు ముందుకు రావడం పట్ల ఆయన సంతోషం వ్యక్తపరిచారు. తాగు, సాగునీరు విద్యుత్ కొరత రాకుండా పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. ఇప్పటికే కేంద్రానికి సమగ్ర నివేదిక పంపించామని అవసరమైతే అఖిలపక్షంతో కలిసి ఢిల్లీకి వెళ్లి రాష్ట్రానికి రావాల్సిన సహాయాన్ని సాధిద్దాం అని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణ విషయంలో ప్రభుత్వం రాజీపడబోదని స్పష్టం చేశారు.తాగునీరు, సాగునీటికి ప్రాధాన్యంవర్షాల కొరత నేపథ్యంలో తాగునీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తకుండా చూడటం, అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థంగా వినియోగించుకోవడం, వాటిని పరిరక్షించడం వంటి అంశాలపై సమావేశంలో చర్చించారు. సాగునీటి అవసరాలకు అనుగుణంగా విద్యుత్ సరఫరా, రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించడం, కరువు పరిస్థితులు తీవ్రరూపం దాల్చకముందే ముందస్తు చర్యలు చేపట్టడం వంటి అంశాలపై అఖిలపక్ష నేతల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. ఎల్‌నినో ప్రభావం కారణంగా వర్షపాతంలో వచ్చే మార్పులు వ్యవసాయ రంగంపై ఎలాంటి ప్రభావం చూపుతాయి రైతులకు ఎదురయ్యే ఇబ్బందులను ఎలా తగ్గించాలి,తాగునీరు, సాగునీటి అవసరాలను ఎలా సమన్వయం చేయాలి వంటి అంశాలపై నేతలు తమ అభిప్రాయాలను వెల్లడించారు. వివిధ రాజకీయ పార్టీలు లేవనెత్తిన ఆందోళనలను ప్రభుత్వం శ్రద్ధగా ఆలకించిందని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. తదుపరి కార్యాచరణను ఖరారు చేసే సమయంలో ఆయా పార్టీల సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు. అంతర్రాష్ట్ర నదీజలాల పంపిణీ, వినియోగానికి సంబంధించిన అంశాల్లో తెలంగాణకు న్యాయం జరిగేలా ప్రభుత్వం కృషి చేస్తుందని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర రైతుల ప్రయోజనాలను పరిరక్షించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రస్తుత పరిస్థితులను రాజకీయాలకు అతీతంగా, నిర్మాణాత్మక దృక్పథంతో ఎదుర్కోవాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశానికి హాజరై తమ అభిప్రాయాలను పంచుకున్న వివిధ పార్టీల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమావేశంలో మాట్లాడారు.

ఆతలాకుతలం..!

- తీవ్ర విషాదాన్ని మిగిల్చిన ఆర్నాబ్ తుఫాన్
- వేర్వేరు ఘటనల్లో ఆరుగురు దుర్మరణం

3

- పలు ఎయిర్ పోర్టుల నుంచి సర్వీసులు రద్దు
- రాష్ట్రం మీదుగా సాగే పలు రైళ్లను రద్దు చేసిన రైల్వే



2.24 లక్షల హెక్టార్లలో పంట నష్టం

- 14 జిల్లాల్లో 3.45లక్షల రైతులపై ప్రభావం
- పంటలకు సీఎం చంద్రబాబు సాయం ప్రకటన



2

విపత్తు నుంచి ఆదుకోండి

- కేంద్ర బృందాలను పంపండి
- ఆర్నాబ్ తుపాన్ కారణంగా తీవ్ర నష్టం
- వేల ఎకరాల్లో నేలకొరిగిన పంటలు
- హోంమంత్రి అమిత్ షాకు రాసిన లేఖలో చంద్రబాబు

అమరావతి - అక్టోబర్ 28:

అర్నబ్ తుపాన్ ప్రభావంతో ఉత్తరాంధ్ర జిల్లాలు జలమయమయ్యాయి. భారీగా కురిసిన వర్షాల వల్ల కోస్తా ప్రాంతాల్లో తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ విపత్తు తీవ్రతను వివరిస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు లేఖ రాశారు. రాష్ట్రాన్ని ఆదుకోవడానికి, నష్టాన్ని ప్రాథమికంగా అంచనా వేయడానికి తక్షణమే కేంద్ర బృందాలను పంపాలని కోరారు. ప్రతికూల వాతావరణం కారణంగా బుధవారం మొత్తం 33 విమాన సర్వీసులను అధికారులు రద్దు చేశారు. శంషాబాద్ విమానాశ్రయం ..మిగతా 2లో



మళ్లీ రూ. 1000 నోట్లు..?

- పసుపు రంగులో, ఆలయ చిత్రంతో త్వరలోకి అందుబాటులోకి
- రిజర్వు బ్యాంక్ ప్రయత్నాలంటూ ప్రచారం
- కొట్టి పారేసిన పీఐబీ ఫ్యాక్ట్ చెక్

న్యూఢిల్లీ, అక్టోబర్ 28:

నోట్ల రద్దు సమయంలో కేంద్ర ప్రభుత్వం రూ.1000 నోటును రద్దు చేసిన విషయం తెలిసిందే. ఈ నోట్లను ఆర్బీఐ వెనక్కి తీసుకుంది. వీటి స్థానంలో రూ.2వేల నోట్లు తీసుకురాగా.. ఆ తరువాత కాలంలో వాటిని కూడా రద్దు చేశారు. అయితే, త్వరలో రూ. వెయ్యి నోటును మళ్లీ చెలామణిలోకి తీసుకొచ్చేందుకు ఆర్బీఐ సిద్ధమైనట్లు వార్తలు వస్తున్నాయి. ఈ నోటు పసుపు రంగుతో ఉండటంతో పాటు దానిపై ఆలయం బొమ్మ ఉంటుందని సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం జరుగుతుంది. ఈ ప్రచారంపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. ఈ మేరకు దీనిపై క్లారిటీ ఇస్తూ పీఐబీ ఫ్యాక్ట్ చెక్ టీమ్ తన ఎక్స్ ఖాతాలో ఒక పోస్టు ..మిగతా 2లో

బ్యాలెట్ సమరంలో 'హస్తం' విలవిల..

- 4 రాష్ట్రాలు.. 28 స్థానాలు.. కాంగ్రెస్ 'జీరో'
- కర్ణాటక, యూపీ, బిహార్, మహారాష్ట్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఘోర పరాభవం
- పాలనలో ఉన్న కర్ణాటకలోనే 4 స్థానాలూ ఊడ్చేసిన బీజేపీ-జేడీఎస్ కూటమి
- ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే స్వంత ఇలాకాలోనే బీజేపీ అభ్యర్థి ఘన విజయం
- "ఇట్స్ డన్ బ్రో" అంటూ డీకేఎస్‌పై విరుచుకుపడ్డ కమలనాథులు
- ప్రధాని మోదీ చురకలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 28 :

దేశవ్యాప్తంగా నాలుగు ప్రధాన రాష్ట్రాల్లో జరిగిన శాసనమండలి ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ పార్టీకి కోలుకోలేని షాక్ ఇచ్చాయి. కర్ణాటక, ఉత్తరప్రదేశ్, బిహార్, మహారాష్ట్రల్లోని మొత్తం 28 పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు జరగ్గా.. కాంగ్రెస్ ఒక్కటంటే ఒక్క స్థానం కూడా గెలవలేక పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. ఈ ఫలితాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు బీజేపీ శ్రేణులు సోషల్ మీడియా వేదికగా వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నాయి. ఈ ఎన్నికలు బ్యాలెట్ పేపర్లతో నిర్వహించినప్పటికీ కాంగ్రెస్ సున్నా సీట్లకే పరిమితమైందని, చివరికి అధికారంలో ఉన్న కర్ణాటకలోనూ ప్రజలు ఆ పార్టీని పూర్తిగా తిరస్కరించారని మోదీ ఎద్దేవా చేశారు.



సాధారణంగా ఎన్నికల్లో ఓడిపోయినప్పుడల్లా ఈవీఎంలను నిందించే కాంగ్రెస్‌కు.. విద్యావంతులు, ఉపాధ్యాయులు బ్యాలెట్ ద్వారా ఇచ్చిన ఈ తీర్పు ఆ పార్టీ సంస్థాగత వైఫల్యానికి నిదర్శనమని ప్రధాని మోదీ చురకలంటించారు.

కర్ణాటకలో కోలుకోలేని దెబ్బ: బీజేపీ-జేడీఎస్ క్లీన్‌స్వీప్

ఈ ఫలితాల్లో కాంగ్రెస్‌కు అత్యంత చేదు అనుభవం కర్ణాటకలోనే ఎదురైంది. సొంత ప్రభుత్వం, అధికార యంత్రాంగం అండగా ఉన్నప్పటికీ అక్కడ ఖాళీ అయిన మొత్తం 4 ఎమ్మెల్సీ స్థానాలనూ ఎన్డీయే (బీజేపీ-జేడీఎస్) కూటమి కైవసం చేసుకుంది.

కాంగ్రెస్ సిట్టింగ్ ఎమ్మెల్సీ పుట్టన్నపై జేడీఎస్ అభ్యర్థి ఏపీ రంగనాథ్ 908 ఓట్ల తేడాతో గెలిచి సీటును ఎగరేసుకుపోయారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సొంత ప్రాంతమైన కలబురగి పరిధిలోని నార్త్-ఈస్ట్ టీచర్స్ స్థానాన్ని బీజేపీ అభ్యర్థి శశిల్ నమౌషి నిలబెట్టుకున్నారు. వెస్ట్ గ్రాడ్యుయేట్స్ స్థానంలో ఎస్వీ సంకనూర్, సౌత్-ఈస్ట్ గ్రాడ్యుయేట్స్‌లో కేఎం సురేష్ విజయం సాధించారు.

'ఇట్స్ డన్ బ్రో'.. బీజేపీ సెటైర్లు

ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మంత్రులను సైతం మోహరించి ప్రచారం చేయించినా విద్యావంతులు, ఉద్యోగుల నుంచి కాంగ్రెస్‌కు మొండిచేయి ఎదురైంది. ఫలితాల అనంతరం కర్ణాటక బీజేపీ "డీకే, ఇట్స్ డన్ బ్రో!" అంటూ అసెంబ్లీలో ఆయన చెవిలో పువ్వు పెట్టుకున్న పాత ఫోటోను షేర్ చేస్తూ ఎద్దేవా చేసింది. కాంగ్రెస్ గ్యారెంటీలు, పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని, 2028 అసెంబ్లీ ఎన్నికలకు ఇదొక దిశానిర్దేశమని జేడీఎస్ చీఫ్ హెచ్‌డీ కుమారస్వామి పేర్కొన్నారు.

మిగతా రాష్ట్రాల్లోనూ అదే పరిస్థితి

11 స్థానాల్లో ఎన్నికలు జరిగిన ఉత్తరప్రదేశ్‌లో మీరట్, లక్నో, బరేలీ వంటి చోట్ల బీజేపీ పట్టు నిలుపుకోగా.. వారణాసి, ఆగ్రా టీచర్స్ స్థానాల్లో సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) గెలిచింది. కాంగ్రెస్ ఎక్కడా ప్రభావం చూపలేకపోయింది. 8 స్థానాల్లో జరిగిన బిహార్‌లో సిట్టింగ్ కాంగ్రెస్ ఎమ్మెల్సీ మదన్ మోహన్ ఝా ఉన్న దర్భంగాలో ప్రశాంత్ కిశోర్ నేతృత్వంలోని 'జన్ సురాజ్ పార్టీ' విజయం సాధించి తొలిసారి మండలిలో అడుగుపెట్టింది. ఆర్జేడీ, బీజేపీ, స్వతంత్రులు ఇతర స్థానాలను దక్కించుకున్నారు. 5 స్థానాల్లో జరిగిన మహారాష్ట్రలో అధికార మహాయుతి కూటమి ఆధిక్యంలో ఉంది.

బ్యాలెట్ పేపర్లతో జరిగిన ఈ ఎన్నికల్లో విద్యావంతులు, ఉపాధ్యాయ ఓటర్లు కాంగ్రెస్‌కు ఏ ఒక్క స్థానంలోనూ అవకాశం ఇవ్వకపోవడం జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారింది. రాబోయే ఎన్నికలకు సంస్థాగత వైఫల్యాలపై కాంగ్రెస్ పునరాలోచన చేసుకోవాల్సిన సమయం వచ్చిందని విశ్లేషకులు భావిస్తున్నారు.

www.bhadradrinews.com
భద్రాద్రి న్యూస్
తెలుగు దినపత్రిక
Follow :
@bhadradrinews
గురువారం
29 । అక్టోబర్ । 2026
www.bhadradrinews.com
epaper.bhadradrinews.com
ఖమ్మం,
భద్రాద్రి కొత్తగూడెం

చదివింది ఇంజినీరింగ్.. చేసేది బైక్ దొంగతనాలు!

జల్సాల మోజులో యువతరం..
బుల్లెట్ బండ్లే టార్గెట్!

భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాల్సిన చేతులతోనే చోరీలు.. ఐదుగురు యువకుల అరెస్ట్.. ఐదు ద్విచక్ర వాహనాలు స్వాధీనం

శేరిలింగంపల్లి : అక్టోబర్ 28:

చేతిలో పుస్తకం ఉండాల్సిన వయసులో దొంగతనాలకు తెరలేపారు.. కలల సౌధాలను నిర్మించుకోవాల్సిన దశలో నేరాల బాట పట్టారు.. ఇంజినీర్లుగా ఎదిగి కుటుంబాలకు అండగా నిలవాల్సిన యువకులు, జల్సాలకు అలవాటుపడి బైక్ దొంగలుగా మారారు! విలువైన భవిష్యత్తును సొంతం చేసుకునే అవకాశం ఉండగానే, క్షణిక సుఖాల కోసం జీవితాలను ప్రమాదంలోకి నెట్టుకున్నారు. చక్కటి చదువులు చదువుతున్న ముగ్గురు ఇంజినీరింగ్ విద్యార్థులు సహా ఐదుగురు యువకులు అంతర్రాష్ట్ర ద్విచక్ర వాహనాల దొంగల ముఠాగా మారడం ఆందోళన కలిగిస్తోంది.

బుల్లెట్ బండ్లపై మోజు.. దొంగతనాలే దారి!

రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ వంటి ఖరీదైన బైక్‌లపై మోజు, విలాసవంతమైన జీవనశైలిపై ఆశ, జల్సాలకు అలవాటు.. వెరసి యువకులను నేరాలవైపు నడిపించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. సైబరాబాద్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలను చోరీ చేసి, వాటికి నకిలీ నంబర్ ప్లేట్లు అమర్చి రాజమండ్రికి తరలిస్తున్న ముఠా గుట్టును చందానగర్ పోలీసులు రట్టు చేశారు.

అనుమానంతో మొదలైన విచారణ.. ముఠా గుట్టురట్టు

ఈ నెల 27, 28 తేదీల మధ్య రాత్రి లింగంపల్లి రైల్వే



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న
రామచంద్రపురం ఏసిపి శ్రీనివాస్ కుమార్..

స్టేషన్‌లోని ఆరో నంబర్ ప్లాట్‌ఫామ్ సమీపంలో పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరు వ్యక్తులు బైక్‌ను వదిలి పారిపోయేందుకు ప్రయత్నించగా, పోలీసులు వారిని వెంబడించి పట్టుకున్నారు. విచారణలో ఆ బైక్ రాయల్ ఎన్‌ఫీల్డ్ క్లాసిక్ 350 అని, దానిని దొంగిలించినట్లు వెల్లడైంది. మరింత లోతుగా విచారించడంతో మరో ముగ్గురితో కలిసి వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్నట్లు బయటపడింది.

ఐదుగురు అరెస్ట్.. ఐదు బైక్‌లు స్వాధీనం

పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిలో రాజమండ్రికి చెందిన గడ్డం ప్రవీణ్ (21), బురిడి గోపీచంద్ (20), చోడవరపు దినేశ్ కుమార్ (22), గీసాల షణ్ముఖ సత్యసాయి (21), సీరపు దినేశ్ కుమార్ (22) ఉన్నారు. వీరిలో ప్రవీణ్, దినేష్ కుమార్, షణ్ముఖ సత్య సాయి ఈ ముగ్గురు ఇంజినీరింగ్ చదువుతున్నట్లు పోలీసులు తెలిపారు. డిసెంబర్ 2025 నుంచి సైబరాబాద్, పరిసర ప్రాంతాల్లో బైక్‌లను దొంగిలిస్తూ వచ్చినట్లు ఆయన తెలిపారు. నిందితుల నుంచి మూడు రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌లు, ఒక కేటీఎం డ్యూక్ సహా మొత్తం ఐదు ద్విచక్ర వాహనాలు, 11 నకిలీ నంబర్ ప్లేట్లు, తాళాలు తెరిచేందుకు ఉపయోగించే పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. ఇతర దొంగతనాలు, మిగిలిన వాహనాల ఆచూకీపై దర్యాప్తు కొనసాగుతోందని పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ శ్రీనివాస్ కుమార్ వెల్లడించారు.

క్షణిక జల్సాల కోసం.. జీవితకాల వేదనా?

ఈ ఘటన యువతకు ఒక హెచ్చరిక. చదువు అనేది ఉద్యోగం సంపాదించడానికి మాత్రమే కాదు.. జీవితంలో సరైన దారి ఎంచుకోవడానికి కూడా పునాది. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు కోసం ఎన్నో ఆశలు పెట్టుకుంటారు. ఫీజులు కట్టి, కష్టపడి చదివిస్తూ, తమ పిల్లలు ఉన్నత స్థానాలకు చేరాలని కలలు కంటారు. అలాంటి ఆశలను జల్సాల మోజుతో బూడిద చేయడం ఎంతటి విషాదం! ఖరీదైన బైక్‌పై తిరగడం కొంతసేపు ఆకర్షణగా అనిపించవచ్చు. స్నేహితుల ముందు గొప్పగా కనిపించాలనే కోరిక క్షణిక ఆనందాన్ని ఇవ్వవచ్చు. కానీ ఇతరుల ఆస్తిని దొంగిలించి సంపాదించే సుఖం ఎప్పటికైనా కష్టాలకే దారితీస్తుంది. పోలీసుల చేతికి చిక్కితే చదువు, ఉద్యోగావకాశాలు, కుటుంబ గౌరవం. అన్నింటిపైనా ప్రభావం పడే ప్రమాదం ఉంది. నేరం నిరూపితమైతే చట్టపరమైన పరిణామాలను కూడా ఎదుర్కోవాల్సి వస్తుంది. బైక్‌పై వేగంగా దూసుకెళ్లడం కంటే జీవితంలో ఉన్నత లక్ష్యాల వైపు దూసుకెళ్లడం ముఖ్యం. బుల్లెట్‌పై తిరగాలనే కోరిక ఉండొచ్చు.. కానీ ఆ బుల్లెట్ సంపాదన నిజాయితీతో ఉండాలి. తల్లిదండ్రుల ఆశలను నిలబెట్టాల్సిన యువత, క్షణిక జల్సాల కోసం తమ భవిష్యత్తును పణంగా పెట్టకూడదనే ఆలోచన యువతలో రావాలి.



ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ కష్టాలకు చెక్.. వన్‌వే లూప్ విధానానికి పోలీసుల కసరత్తు!

బయోడైవర్సిటీ నుంచి నాలెడ్జ్ సిటీ వరకు వన్‌వే మార్గం..
నాలుగు కీలక జంక్షన్లలో ట్రాఫిక్ రద్దీకి పరిష్కారం దిశగా అడుగులు

శేరిలింగంపల్లి : అక్టోబర్ 28,:

ఐటీ కారిడార్‌లో ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు కసరత్తు చేస్తున్నారు. సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్‌సీఎస్‌సీ) సహకారంతో హైటెక్ సిటీ, బయోడైవర్సిటీ ప్రాంతాల్లో 'వన్‌వే లూప్' విధానాన్ని అమలు చేసే ప్రతిపాదనను పరిశీలిస్తున్నారు. ఈ విధానం ద్వారా కీలకమైన నాలుగు జంక్షన్ల వద్ద ట్రాఫిక్ రద్దీని తగ్గించి, వాహనాల రాకపోకలను సులభతరం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రతిపాదిత ప్రణాళిక ప్రకారం బయోడైవర్సిటీ జంక్షన్ నుంచి ఐకియా రోటరీ, రహేజా మైండ్‌స్పేస్ (సీ-గేట్), నాలెడ్జ్ సిటీ, డల్లాస్ సెంటర్ మీదుగా మై హోమ్ భూజా వద్ద కుడివైపు మలుపు తీసుకుని తిరిగి బయోడైవర్సిటీ జంక్షన్‌కు చేరుకునేలా నిరంతర వన్‌వే మార్గాన్ని ఏర్పాటు చేయనున్నారు. రహదారి అందుబాటులో ఉన్న పూర్తి వెడల్పును వినియోగించుకోవడం, జంక్షన్ల వద్ద వాహనాల నిరీక్షణ సమయాన్ని తగ్గించడం, ట్రాఫిక్ సాఫీగా సాగేలా చూడటం ఈ ప్రణాళిక ప్రధాన ఉద్దేశం. ఈ ప్రతిపాదన సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేశ్, జాయింట్ పోలీస్ కమిషనర్ (ట్రాఫిక్) సున్‌ప్రీత్ సింగ్, ఇతర ట్రాఫిక్ పోలీసు ఉన్నతాధికారులు, ఎస్‌సీఎస్‌సీ సీఈఓ నవీద్ ఖాన్ బృందం క్షేత్రస్థాయిలో పర్యటించింది. ప్రతిపాదిత మార్గంలోని రహదారుల పరిస్థితి, జంక్షన్ల వద్ద ఎదురవుతున్న సమస్యలను పరిశీలించింది. తదుపరి దశలో వాహనాల వేగం, ట్రాఫిక్ సాంద్రతను అంచనా వేసేందుకు ప్రత్యేక ట్రాఫిక్ సిమ్యులేషన్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఐటీ సంస్థలు, వ్యాపార సంస్థలు, స్థానిక భాగస్వాములతో సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేసి వారి అభిప్రాయాలు, సూచనలను సేకరించనున్నారు. ఈ సందర్భంగా సీపీ డాక్టర్ ఎం. రమేశ్ మాట్లాడుతూ అన్ని వర్గాల సూచనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని, అమలు ప్రణాళికను ఖరారు చేసిన తర్వాతే వన్‌వే లూప్ విధానాన్ని దశలవారీగా అమలు చేస్తామని తెలిపారు. ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా ముందుగానే ట్రాఫిక్ సూచనలు, మార్గమళ్లింపుల వివరాలను అధికారికంగా ప్రకటిస్తామని వెల్లడించారు.



ఎల్‌నినో ప్రభావం గ్రామీణ ప్రాంతాలపై పడకుండా వీబీ--జీ రామ్ జీ పనులపై

ప్రత్యేక దృష్టి సారించాలి





గ్రామీణ ఉపాధి,నీటి భద్రత,పశుసంపద సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి

వీబీ--జీ రామ్ జీ పనుల అమలులో సర్పంచులు కీలక పాత్ర పోషించాలి

నిర్మాణంలో ఉన్న గ్రామీణ భవనాల పనులు వేగవంతం చేయాలి

గ్రామాల్లో ఉత్తమ పనులు చేపడుతున్న సర్పంచులు,అధికారుల కృషిని అభినందించిన మంత్రి సీతక్క

రాష్ట్ర పంచాయతీ రాజ్,గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి వర్యులు దనసరి అనసూయ (సీతక్క)

గద్వాల జిల్లా :

ఎల్‌నినో ప్రభావం గ్రామీణ ప్రాంతాలపై పడకుండా వీబీ--జీ రామ్ జీ పనులను ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని రాష్ట్ర పంచాయతీ రాజ్ ఉ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి వర్యులు దనసరి అనసూయ (సీతక్క) అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర పంచాయతీ రాజ్ ఉ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి వర్యులు దనసరి అనసూయ (సీతక్క),పంచాయతీరాజ్ , గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్,సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్,ఉన్నతాధికారులతో వీబీ --జి రామ్ జి అమలు పై జిల్లాస్థాయి, మండలస్థాయి అధికారులు, ఐటీడీఏ పీఓలు,ఎంపీడీవోలు, సర్పంచులు,పంచాయతీ కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పంచాయతీ రాజ్ ఉ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి వర్యులు దనసరి అనసూయ (సీతక్క) మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో జీవనోపాధిపై ఎలాంటి ప్రభావం పడకుండా పనులు కల్పించాలని ఆదేశించారు. గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించి ఆర్థికంగా అండగా నిలుస్తూ,నీటి భద్రతను పెంపొందించేలా వీబీ --జీ రామ్ జీ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో వీబీ --జి రామ్ జీ పనుల అమలులో సర్పంచులు కీలక పాత్ర పోషించాలని,కూలీలను సమీకరించి పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అదేవిధంగా,గ్రామాల్లో మేట్‌లను గుర్తించి, వారికి అవసరమైన శిక్షణ అందించి పనుల నిర్వహణలో సమర్థవంతంగా భాగస్వాములను చేయాలని తెలిపారు. రాష్ట్రంలో చెరువుల పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ, నీటిపారుదల శాఖ అధికారులతో సమన్వయం చేసుకొని గ్రామాల్లోని చెరువులు, కాలువలను గుర్తించి,వాటిలో పూడిక తొలగింపు పనులు చేపట్టి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఎల్‌నినో ప్రభావంతో పశువులకు నీరు, పశుగ్రాసం కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని,గ్రామాల్లో పశువుల కోసం నీటి తొట్టెలు ఏర్పాటు చేసి నిరంతరం నీటి లభ్యత ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు.ఎల్‌నినో ప్రభావంతో పశుగ్రాస కొరత తలెత్తకుండా వీబీ --జి రామ్ జి పథకం కింద పశుగ్రాస సాగును ప్రోత్సహిస్తూ,ఎకరాకు 14,000 వేల ఆర్థిక సహాయం అందించే అంశంపై రైతులకు అవగాహన కల్పించి,పశుసంపద సంరక్షణకు చర్యలు చేపట్టాలని సూచించారు. జలసిరి లో భాగంగా ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు,ప్రతి ఊరికి ఊట కుంటలు,ప్రతి పంటకు నీటి కుంటలు నిర్మించి వర్షపు నీటిని నిల్వ చేసి భూగర్భ జలాలను పెంచే చర్యలు చేపట్టాలని తెలిపారు.జిల్లాలో నిర్మాణంలో ఉన్న గ్రామ పంచాయతీ భవనాలు,అంగన్వాడీ భవనాలు మరియు విలేజ్ ఆర్గనైజేషన్ భవనాల పనులను వేగవంతం పూర్తి చేయాలన్నారు. వీబీ--జీ రామ్ జీ పథకం కింద చేపట్టే పనులను స్పష్టమైన ప్రణాళికతో, పూర్తి పారదర్శకతతో నిర్వహించాలన్నారు.అనంతరం గ్రామాల్లో వీబీ--జీ రామ్ జీ పథకం కింద ఉత్తమంగా పనులు చేపట్టి విజయవంతంగా అమలు చేసిన సర్పంచులు, ఎంపీడీవోలు,సంబంధిత అధికారులతో మాట్లాడి,వారి కృషిని అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు మాట్లాడుతూ జిల్లాలో గ్రామీణాభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టి నిర్దేశిత లక్ష్యాల మేరకు పూర్తి చేయాలని సూచించారు.గ్రామీణాభివృద్ధి పనులను వేగవంతం చేసి,నిర్మాణంలో ఉన్న భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారిని ముషాయిదా బేగం,డీపీఓ శ్రీకాంత్, వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప, పంచాయత్ రాజ్ ఈ.ఈ ప్రభాకర్, మిషన్ భగీరథ ఈ ఈ లు శ్రీధర్ రెడ్డి,పరమేశ్వర్,వివిధ శాఖల సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులలో ప్రతిభకు పట్టం.. వ్యాసరచన పోటీల్లో విజేతలు

పోలీస్ ఫ్లాగ్ డే వారోత్సవాల్లో భాగంగా పోటీలు.. విజేతలను అభినందించిన సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్

శేరిలింగంపల్లి : అక్టోబర్ 28:

విధి నిర్వహణలోనే కాదు.. సృజనాత్మకత, రచనా నైపుణ్యాల్లోనూ పోలీసు సిబ్బంది తమ ప్రతిభను చాటారు. పోలీస్ ఫ్లాగ్ డే వారోత్సవాలను పురస్కరించుకుని సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన సిబ్బంది పేర్లను పోలీసు శాఖ ప్రకటించింది. తెలుగు, ఆంగ్ల భాషల్లో రెండు కేటగిరీలుగా నిర్వహించిన ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారిని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ అభినందించారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ ఆదేశాల మేరకు అక్టోబర్ 21న పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా ప్రారంభమైన వారోత్సవాలు అక్టోబర్ 31 వరకు కొనసాగనున్నాయి. ఇందులో భాగంగా పోలీసు సిబ్బందిలో సృజనాత్మకతను, రచనా సామర్థ్యాన్ని, ఆలోచనా శక్తిని ప్రోత్సహించేందుకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీలను రెండు కేటగిరీలుగా విభజించారు. మొదటి కేటగిరీలో ఏఆర్ఎస్ఐలు, ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లకు అవకాశం కల్పించగా.. రెండో కేటగిరీలో ఆర్ఎస్ఐలు, ఎస్ఐలు, అంతకంటే పైస్థాయి అధికారులు పాల్గొన్నారు. మొదటి కేటగిరీలో కె. రమేష్ ప్రథమ, పి. జ్యోతి ద్వితీయ, జి. రాజమణి తృతీయ బహుమతులు సాధించారు. రెండో కేటగిరీలో బి. వెంకటరమణ ప్రథమ, జె. ఉపేందర్ ద్వితీయ, జి. శశిధర్ తృతీయ బహుమతులు దక్కించుకున్నారు. ఆంగ్ల వ్యాసరచనలో విజేతలు మొదటి కేటగిరీలో జి. రూప మొదటి, ఈ. సునీత రెండో, ఎం. దివ్య మూడో బహుమతులు గెలుచుకున్నారు. రెండో కేటగిరీలో ఎన్. రోహిణి ప్రథమ, ఎస్. రఘు ద్వితీయ, వి. యతీష్ చంద్ర తృతీయ బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా విజేతలను సీపీ డాక్టర్ ఎం. రమేష్ అభినందించారు. పోలీసు సిబ్బందిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంతో పాటు వారి వ్యక్తిగత, వృత్తిపరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని సీపీ పేర్కొన్నారు.

విపత్తు నుంచి ఆదుకోండి

మొదటి పేజీ తరువాయి...

నుంచి బయలుదేరాల్సిన 17 విమానాలతో పాటు ఏపీలోని వివిధ ప్రాంతాల నుంచి రావాల్సిన 16 విమానాలు రద్దయ్యాయి. ముఖ్యంగా శంషాబాద్ నుంచి విశాఖపట్నం, విజయవాడ, రాజమహేంద్రవరం వెళ్లే విమానాలపై ఈ ప్రభావం పడింది. తుపాన్ నష్టంపై ప్రాథమిక అంచనాలను వివరిస్తూ సీఎం చంద్రబాబు కేంద్రానికి లేఖ రాశారు. ప్రభుత్వం ముందుస్తుగా చేపట్టిన ముందస్తు జాగ్రత్తల వల్ల ఇప్పటివరకు ఎలాంటి ప్రాణనష్టం జరగలేదన్నారు. ప్రమాదకర ప్రాంతాల నుంచి దాదాపు 28,000 మందికి పైగా ప్రజలను సురక్షితమైన పునరావాస కేంద్రాలకు తరలించామని తెలిపారు. 14 జిల్లాల్లో సహాయక చర్యల కోసం 16 ఎన్డీఆర్ఎఫ్, 11 ఎస్డీఆర్ఎఫ్ బృందాలను రంగంలోకి దించినట్టుగా పేర్కొన్నారు. 'భారీ వర్షాలకు సుమారు 70,900 హెక్టార్లలో వరి పంట, 10,450 హెక్టార్లలో ఉద్యానవన పంటలు నీట మునిగాయి. ప్రాథమిక అంచనా ప్రకారం 180 ఇళ్లు దెబ్బతిన్నాయి. రహదారులపై 220కి పైగా చెట్లు కూలిపోవడంతో రవాణా వ్యవస్థకు ఆటంకం ఏర్పడింది. తీరప్రాంతాల్లో రోడ్లు ధ్వంసమవ్వగా, అనేక చోట్ల విద్యుత్ వ్యవస్థ నిలిచిపోయింది.' అని చంద్రబాబు వివరించారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాలైన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ, కాకినాడ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, అనకాపల్లి, కృష్ణా జిల్లాల్లో ప్రభావం ఎక్కువగా ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. విద్యుత్, మంచినీటి సరఫరాను పునరుద్ధరించేందుకు అధికారులు యుద్ధప్రాతిపదికన పనిచేస్తున్నారని చంద్రబాబు చెప్పారు. రాష్ట్ర అత్యవసర ఆపరేషన్స్ కేంద్రంతో పాటు జిల్లాల్లోని కంట్రోల్ రూమ్‌లు నిరంతరం పరిస్థితిని సమీక్షిస్తున్నాయని ముఖ్యమంత్రి అన్నారు. పూర్తిస్థాయి నష్టపరిహార నివేదికను త్వరలోనే కేంద్రానికి అందిస్తామని, సహాయక చర్యల్లో కేంద్ర సంస్థలు సహకరించాలని కోరుతూ.. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న మద్దతుకు సీఎం చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు



2.24 లక్షల హెక్టార్లలో పంట నష్టం

అమరావతి అక్టోబర్ 28 :

అర్నబ్ అత్యంత తీవ్ర తుఫాను కారణంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో పంటలు దెబ్బతిన్నాయి. వ్యవసాయ, ఉద్యాన పంటలకు భారీ నష్టం వాటిల్లింది. తుపాను కారణంగా రాష్ట్రంలో 2.24 లక్షల హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. 14 జిల్లాల్లో సుమారు 3.45లక్షల మంది రైతులపై తుపాను ప్రభావం చూపిందని ప్రభుత్వం పేర్కొంది. చేతికొచ్చిన పంటలు దెబ్బతినడంతో రైతులు లబోదిబోమంటున్నారు. అయితే, ప్రభుత్వం తుపాను ప్రభావంతో దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం ప్రకటించింది.

ఏ పంటకు ఎంత నష్టపరిహారం అంటే..
పత్తి, గోధుమ పంటలకు ఎకరాకు రూ.25 వేల పరిహారం
చెరుకు పంటకు ఎకరాకు రూ.25 వేల పరిహారం
సజ్జ, మినుము, పెసర, మొక్కజొన్న, రాగి, శెనగ..
సోయాబీన్, పొద్దుతిరుగుడుకు రూ.15 వేల సాయం
అరటి, పసుపు, మామిడి, జీడిమామిడితో పాటు..
కాఫీ, డ్రాగన్ ఫ్రూట్‌కు ఎకరాకు రూ.35 వేల పరిహారం
కూరగాయలు, బొప్పాయి, టమాట, పైనాపిల్‌కు రూ.25 వేలు..
తమలపాకు తోటలకు ఎకరాకు రూ.75 వేల పరిహారం
కొబ్బరి, ఆయిల్ పామ్ ఒక్కో చెట్టుకు రూ.15 వేలు

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి జెండా ఎగరడం ఖాయం

- ప్రతి మండలం నుంచి వెయ్యి మంది గ్రాడ్యుయేట్లను ఓటర్లుగా నమోదు చేయించాలి

- బిజెపి నేత,ఎమ్మెల్సీ అంజిరెడ్డి

కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 28 (భద్రాద్రిన్యూస్):-రాష్ట్రంలో జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులు గెలిపి లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని బిజెపి నేత, ఎమ్మెల్సీ అంజిరెడ్డి పేర్కొన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి మండలం నుండి భారతీయ జనతా పార్టీ 1000 మంది గ్రాడ్యుయేట్లను ఓటర్లుగా నమోదు చేయాలని సూచించారు. ఉమ్మడి నల్లగొండ వరంగల్ ఖమ్మం జిల్లాల కో కన్వీనర్ వన్నాల వెంకటరమణ పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ఎంఎల్సి అంజి రెడ్డి మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టు ఈ యొక్క జిల్లా నుండి వెళ్తున్న కూడా ఇక్కడి స్థానికంగా ఉన్నటువంటి మండలాలకి నీరుని అందించే పరిస్థితి లేదని పేర్కొన్నారు. ఇదే ఉమ్మడి జిల్లాకు సంబంధించిన ముగ్గురు మంత్రులు ఉన్న కాంగ్రెస్ పార్టీ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కూడా సాగునీరు అందించలేని నిస్సహాయ స్థితిలో ఉన్నందుకు మంత్రులు సిగ్గుపడాలని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ రాబోవు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎలక్షన్లో భారతీయ జనతా పార్టీ జెండా ఎగరడం ఖాయమని పేర్కొన్నారు. ఇందుకుగాను ప్రతి కార్యకర్త కూడా బాధ్యతాయుతంగా పనిచేయాలని దిశా నిర్దేశం చేశారు. అనంతరం ఎమ్మెల్సీ శ్రీ అంజి రెడ్డి భారతీయ జనతా పార్టీ కార్యకర్తలతో ప్రమాణం చేపిస్తూ ప్రతి కార్యకర్త కూడా భారతీయ జనతా పార్టీ విజయానికై కృషి చేయాలని తెలియజేశారు. అదేవిధంగా ఈ యొక్క ఎన్నికలు సెమీఫైనల్ లాంటివని, భారతీయ జనతా పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తలని ఉద్దేశించి దిశా నిర్దేశం చేశారు. ఈ యొక్క ఎన్నికలలో ఏ ఒక్క పార్టీతో కూడా పొత్తు ఉండదని భారతీయ జనతా పార్టీ సొంతంగానే పోటీ చేస్తుందని కార్యకర్తలకు తెలియజేశారు. భారతీయ జనతా పార్టీ సంస్థాగతంగా రోజురోజుకు బలం పెంచుకుంటుందని, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రాబోవు అన్ని ఎన్నికలలో గెలుస్తుందని



తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి భోగి కృష్ణ, డాక్టర్ జాటోత్ వెంకన్న, పుణ్యం బిక్షపతి, చెరుకు భాగ్యలక్ష్మి, భూక్య దివ్యశ్రీ, జిల్లా కోశాధికారి ముకుంద రెడ్డి, జిల్లా కార్యదర్శి పుణ్యానాయక్, రఘురాం జిల్లా యువ మోర్చా అధ్యక్షులు జుజ్జూరు మోహన్, కృష్ణ లక్ష్మీదేవి పల్లి మండల అధ్యక్షులు నవీన్ కుమార్, బలగం శ్రీధర్, రాపాక రమేష్, శంభు నాయక్, బట్టు రమేష్, సుచిత్రపాపి, నాయిని శ్రీను, ముసుకు శ్రీనివాస్ రెడ్డి, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు రహీం, యువమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కోల హరీష్, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

56వ డివిజన్ స్మశాన వాటికలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని వినతి

- కొత్తగూడెం: 56వ డివిజన్ స్మశాన వాటికలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని వినతి



కొత్తగూడెం అర్బన్,అక్టోబర్ 28(భద్రాద్రిన్యూస్) :- రానున్న దీపావళి పండుగను దృష్టిలో ఉంచుకుని 56వ డివిజన్‌లోని స్మశాన వాటికలో విద్యుత్ దీపాలను పునరుద్ధరించాలని, పిచ్చి మొక్కలను తొలగించి పరిసరాలను శుభ్రం చేయాలని కోరుతూ ఈరోజు కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్, మేయర్‌లను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. దీపావళి నేపథ్యంలో 56వ డివిజన్‌లోని స్మశాన వాటికలో విద్యుత్ దీపాలను పునరుద్ధరించి, పిచ్చి మొక్కలను తొలగించి పరిసరాలను శుభ్రం చేయాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్, మేయర్‌కు వినతిపత్రం సమర్పించారు. మాజీ కౌన్సిలర్ సత్యభామ, కాంగ్రెస్ నాయకుడు సుందర్ రాజ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గాజుల శ్రీనివాస్ రాజశేఖర్, విష్ణు, అశోక్,మోమీద్, జగదీష్ పాల్గొనటం జరిగినది

శీనన్న జన్మదిన వేడుకల్లో సేవా స్ఫూర్తి..

- పెద్దమ్మతల్లి అన్నదానానికి లక్ష రూపాయలకు పైగా విరాళం!

- రూ.1,00,116 విరాళం అందించిన డాక్టర్ బి.ఎస్.రావు

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని పెద్దమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు





పాల్వంచ, అక్టోబర్ 28 (భద్రాద్రిన్యూస్): ప్రజానాయకుడు, రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి (శీనన్న) జన్మదినాన్ని పురస్కరించుకుని సేవా స్ఫూర్తిని చాటే కార్యక్రమం నిర్వహించారు. కొత్తగూడెంకు చెందిన ప్రముఖ ఈఎన్‌టీ వైద్యులు, కార్పొరేటర్ డాక్టర్ బి.ఎస్.రావు పెద్దమ్మతల్లి ఆలయంలో నిత్య అన్నదాన కార్యక్రమానికి రూ. 1,00,116 విరాళంగా అందజేశారు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఉగంటి గోపాలరావు చేతుల మీదుగా ఈ విరాళాన్ని ఆలయానికి సమర్పించారు. అనంతరం పెద్దమ్మతల్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సంపూర్ణ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. ప్రజలకు మరింతకాలం సేవలందిస్తూ రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని



ఆకాంక్షించారు.

సేవా కార్యక్రమాలతో జన్మదిన వేడుకలు

జన్మదిన వేడుకలను కేవలం ఉత్సవాలకే పరిమితం చేయకుండా, ఆధ్యాత్మికతతో పాటు అన్నదాన సేవకు ప్రాధాన్యతనిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం విశేషం. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం, అవసరంలో ఉన్నవారికి అండగా నిలవడం, సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలకు చేయూతనివ్వడం నిజమైన మానవత్వానికి నిదర్శనమని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం, పేదల అభ్యున్నతి, రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. నాయకుల పట్ల అభిమానాన్ని ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాల రూపంలో వ్యక్తం చేయడం అభినందనీయమని పేర్కొంటూ, అన్నదానానికి విరాళం అందించిన డాక్టర్ బి.ఎస్.రావును పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో రేగళ్ల పెద్ద తండా సర్పంచ్ లావుడ్య పూర్ణ, డాక్టర్ బట్టు రవి, లావుడ్య బావు సింగ్ తదితరులు పాల్గొన్నారు. పెద్దమ్మతల్లి సన్నిధిలో నిర్వహించిన ఈ సేవా కార్యక్రమం ద్వారా శీనన్న జన్మదిన వేడుకల్లో అన్నదాన సేవకు ప్రాధాన్యతనిస్తూ, సేవా స్ఫూర్తిని చాటారు.

కామ్రేడ్ రత్నకుమారికి సీపీఐ నేతల పరామర్శ..

- ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచించిన సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్

- మోకాళ్ల మార్పిడి శస్త్రచికిత్స విజయవంతం కావడం పట్ల హర్షం..



కొత్తగూడెం అర్బన్ ,అక్టోబర్ 28(భద్రాద్రిన్యూస్):- కామ్రేడ్ కరిష రత్నకుమారిని ఆమె స్వగృహంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, వ్యాపారవేత్త నయీమ్ కురిసే, మహిళా సమాఖ్య నాయకురాళ్లు మేదిని లక్ష్మి, భూదేవి అమ్మ తదితరులు కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఇటీవల రెండు మోకాళ్ల మార్పిడి శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తిచేసుకుని ఇంటికి తిరిగి వచ్చిన రత్నకుమారి యోగక్షేమాలను వారు అడిగి తెలుసుకున్నారు. శస్త్రచికిత్సలు విజయవంతం కావడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. ఆమె త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆరోగ్యపరమైన జాగ్రత్తలు పాటిస్తూ వైద్యుల సూచనలను అనుసరించాలని సూచించారు. ఏ ఆపద వచ్చినా, ఏ అవసరం ఎదురైనా తాము అండగా ఉంటామని భరోసా కల్పిస్తూ ధైర్యం చెప్పారు. కామ్రేడ్ రత్నకుమారికి తమ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని వారు పేర్కొన్నారు.

ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో ఘనంగా మంత్రి పొంగులేటి జన్మదినం వేడుకలు



ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 28 (భద్రాద్రిన్యూస్) :-తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార మరియు పౌర సంబంధాల శాఖల మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారి జన్మదినాన్ని పురస్కరించుకుని ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో కేక్ కటింగ్ కార్యక్రమంతో పాటు మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ మద్దిరెడ్డి నిరంజన్ రెడ్డి , స్వర్ణకుమారి , బ్లూమింగ్ మైండ్స్ స్కూల్ డైరెక్టర్ అశోత్రెడ్డి , ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మన్ కడారి రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. వారు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవిస్తూ ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఆపదలో ఉన్నవారికి రక్తం అందించడం ద్వారా విలువైన ప్రాణాలను కాపాడవచ్చని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రజల్లో రక్తదానంపై అవగాహన పెంపొందించడంతో పాటు సేవాభావాన్ని చాటిచెప్పేలా మెగా రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా సామాజిక బాధ్యత, మానవతా విలువలు, సేవాభావం ప్రాధాన్యతను దాటి చెప్పారు.

శనగపాటి అమ్మా నాన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో

జర్నలిస్టులకు ప్రతిభా పురస్కారం

-- నెల నెలా కవి సమ్మేళనం

-- నెలకో పాఠశాల సందర్శన

-- విద్యార్థుల ప్రతిభాపాటవాలకు బహుమతులు

-సమకాలీన అంశాలపై చర్చా వేదికల నిర్వహణ

-- సీనియర్ జర్నలిస్ట్, శనగపాటి అమ్మా నాన్న ఫౌండేషన్ వ్యవస్థాపకులు శనగపాటి మురళీకృష్ణ



ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 28(భద్రాద్రిన్యూస్):-
శనగపాటి అమ్మా నాన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని జర్నలిస్టుల ప్రతిభను పోత్సాహమందించేందుకు ఏటేటా నగదు పురస్కారాలు అందించనున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు, సీనియర్ జర్నలిస్టు శనగపాటి మురళీకృష్ణ పేర్కొన్నారు. ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఫౌండేషన్ కార్యక్రమాలను వివరించారు. 'ఎల్‌నినో – పేదల జీవనంపై ప్రభావం' అనే అంశంపై ఈ ఏడాది అక్టోబర్ 30 నుండి నవంబర్ 30 వరకు రాసిన కథనాలను డిశెంబర్ 10వ తేదీలోగా తమ ఫౌండేషన్ చిరునామాకు పంపించాలని సూచించారు. ప్రింట్ మీడియా జర్నలిస్టులు పేపర్ క్లిప్పింగ్‌తో పాటు ఆ రోజు పత్రికను కథనంతో జత చేసి పంపించాలని సూచించారు. అలాగే డిజిటల్ మీడియా విలేకర్లు కథనంతో పాటు వెబ్ సైట్ లింక్‌ను పంపించాలన్నారు. అవార్డుకు పంపేవారు హామీ పత్రం, పాస్‌పోర్టో, చిరుమాను జత చేసి పంపించాలన్నారు. పోటీకి వచ్చిన కథనాలను సీనియర్ జర్నలిస్టులు నామా పురుషోత్తం, కనకం సైదులు ఆధ్వర్యంలో కమిటీ పరిశీలించి ఎంపిక చేస్తుందని తెలిపారు. అవార్డుల ఎంపికలో కమిటీదే తుది నిర్ణయమని, దీనిపై ఎలాంటి ఉత్తర, ప్రత్యుత్తరాలకు తావు లేదని పేర్కొన్నారు. ఎంపిక చేసిన జర్నలిస్టులకు 2028 జనవరిలో అవార్డులను అందచేస్తామన్నారు. ప్రింట్ మీడియా జర్నలిస్టుకు 5000 నగదు బహుమతి, డిజిటల్ మీడియాకు 3000 నగదు బహుమ తితో పాటు మెమెంటో, ప్రశంసాపత్రం అందచేసి సన్మానించనున్నట్లు తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని జర్నలిస్టు మిత్రులు ఈ పురస్కారానికి తమ కథనాలను టి మీడియా కార్యాలయం, ఆర్టీసీ డిపో వెనుక, మామిళ్ళగూడెం అనే చిరునామాకు పంపించాలని కోరారు. పూర్తి వివరాలకు 98666 45218, 8919710365 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

-- నెలకో కవి సమ్మేళనం నిర్వహణ

ఫౌండేషన్ ఆధ్వర్యంలో సామాజిక, సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. నెలకో కవి సమ్మేళనం నిర్వహించి వర్ధమాన కవులను ప్రోత్సహిస్తామన్నారు. ప్రతి నెలా ఏదైనా ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలను నిర్వహించి బహుమతులను అందచేస్తామన్నారు. అలాగే సమకాలీన అంశాలపై చర్చా వేదికలు, సెమినార్లు, రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. ఫౌండేషన్ కార్యక్రమాలను అందరూ ప్రోత్సహించి సహకరించాలని కోరారు. ఈ మీడియా సమావేశంలో జర్నలిస్టుల అవార్డు కమిటీ కన్వీనర్, సీనియర్ జర్నలిస్టు నామా పురుషోత్తం, ఫౌండేషన్ సభ్యులు జి.రామారావు పాల్గొన్నారు.

తుఫాన్ ప్రభావంతో ఖమ్మం జిల్లాలో ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలి

- ఎల్‌నినో ప్రభావం నుంచి తాత్కాలిక ఉపశమనం..

వర్షపు నీటిని ఒడిసిపట్టి నిల్వ చేసుకోవాలి

- మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్



ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 28 (భద్రాద్రి న్యూస్): తుఫాన్ ప్రభావంతో ఖమ్మం జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సూచించారు. తుఫాన్ కారణంగా సంభవించే నష్టాలను నివారించేందుకు ప్రభుత్వం ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని కోరారు. ఎల్‌నినో ప్రభావం నుంచి ప్రస్తుత వర్షాలతో తాత్కాలిక ఉపశమనం లభిస్తున్న నేపథ్యంలో, వర్షపు నీటిని భవిష్యత్తు అవసరాల కోసం నిల్వ చేసుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, కోతకు సిద్ధంగా ఉన్న పంటలు, వర్షాలకు తడిసి నష్టపోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సూచించారు.

www.bhadradrinews.com
భద్రాద్రి న్యూస్
తెలుగు దినపత్రిక
Bhadradrinews Telugu Daily
Follow :
@bhadradrinews
గురువారం
29 । అక్టోబర్ । 2026
www.bhadradrinews.com
epaper.bhadradrinews.com
ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం

దసరా వేళ ఖమ్మం ఆర్టీసీకి కాసుల వర్షం!

- 18 రోజుల్లో రూ.28.51 కోట్ల ఆదాయం..

1,387 అదనపు బస్సుల నిర్వహణ

- 52 లక్షల కిలోమీటర్లకు పైగా బస్సుల ప్రయాణం.. ఆర్టీసీ సేవలను వినియోగించుకున్న 41.72 లక్షల మంది ప్రయాణికులు

ఖమ్మం ప్రతినిధి , అక్టోబర్ 28 (భద్రాద్రిన్యూస్): దసరా పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) ఖమ్మం రీజియన్ చేపట్టిన ముందస్తు రవాణా ఏర్పాట్లు సత్ఫలితాలను ఇచ్చాయి. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా అదనపు బస్సులను నడపడంతో సంస్థకు భారీ ఆదాయం సమకూరింది. అక్టోబర్ 9 నుంచి 26వ తేదీ వరకు 18 రోజుల వ్యవధిలో మొత్తం 11,749 సర్వీసులను నిర్వహించి రూ. 28,51,93,080 ఆదాయాన్ని ఆర్జించింది.

1,387 అదనపు సర్వీసులు

దసరా పండుగను పురస్కరించుకుని అక్టోబర్ 9 నుంచి 19వ తేదీ వరకు హైదరాబాద్ పరిసర ప్రాంతాల నుంచి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని వివిధ ప్రాంతాలకు ప్రయాణికుల రాకపోకలు పెరగడంతో 927 అదనపు సర్వీసులను నడిపారు. సాధారణ సర్వీసులతో కలిపి మొత్తం 7,283 సర్వీసులను నిర్వహించి, 31,98,724 కిలోమీటర్లు బస్సులను నడపడం ద్వారా రూ. 17,13,48,498 ఆదాయాన్ని సమకూర్చుకున్నారు. ఈ సమయంలో 25,63,352 మంది ప్రయాణికులు ఆర్టీసీ సేవలను వినియోగించుకున్నారు.

తిరుగు ప్రయాణాల్లోనూ భారీ రద్దీ

దసరా అనంతరం ప్రయాణికుల తిరుగు ప్రయాణాల కోసం అక్టోబర్ 20 నుంచి 26వ తేదీ వరకు మరో 460 అదనపు సర్వీసులను ఏర్పాటు చేశారు. ఈ ఏడు రోజుల్లో మొత్తం 4,466 సర్వీసులను నడిపి, 20,03,411 కిలోమీటర్ల మేర బస్సులను ఆపరేట్ చేశారు. తద్వారా రూ. 11,38,44,582 ఆదాయం సమకూరింది. ఈ సమయంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి హైదరాబాద్‌కు 16,08,917 మంది ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారు.

సిబ్బందికి అభినందనలు.. ప్రయాణికులకు కృతజ్ఞతలు

పండుగ రద్దీకి అనుగుణంగా ముందస్తు ప్రణాళికతో బస్సులను నడిపి, సమన్వయంతో పనిచేసిన క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది, డ్రైవర్లు, కండక్టర్లకు రీజియన్ అధికారులు అభినందనలు తెలిపారు. ఆర్టీసీ సేవలను ఆదరించి ప్రయాణించిన ప్రయాణికులకు కృతజ్ఞతలు తెలియజేశారు. భవిష్యత్తులోనూ ప్రయాణికుల మన్ననలు పొందేలా మరింత మెరుగైన రవాణా సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు.

పండితాపురంలో ఘనంగా పొంగులేటి జన్మదిన వేడుకలు

- కేక్ కట్ చేసిన మల్లిబాబు యాదవ్, ధనియాకుల హనుమంతరావు



ఖమ్మం ప్రతినిధి ,అక్టోబర్ 28 (భద్రాద్రిన్యూస్):-

కామేపల్లి మండలం పండితాపురం గ్రామంలో పశువుల సంత లో పొంగులేటి ప్రధాన అనుచరుడు డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ ఆధ్వర్యంలో పొంగులేటి జన్మదినం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పి ఎస్ ఎస్ అధ్యక్షులు ధనియాకుల హనుమంతరావు, సర్పంచ్ ధరావత్ అనురాధ, ఉప సర్పంచ్ మేకల మల్లికార్జునరావు, తదితరులు పాల్గొని భారీ కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకొని ఆనందోత్సాహాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మల్లి బాబు యాదవ్ మాట్లాడుతూ మాట ఇస్తే తప్పకుండా ఆరు నూరైనా పిలిస్తే ఎక్కడ ఉన్నా నేనున్నానంటూ వచ్చే మంచి మనసున్న పొంగులేటి శీనన్నకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుకుంటున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో కీలకంగా ఉంటూ పేద ప్రజల సంక్షేమం కోసం ఇందిరమ్మ ఇండ్లు, రైతుల కోసం భూభారతి లాంటి ఎన్నో వినూత్న పథకాలు తీసుకొచ్చి అమలు చేస్తున్న ఘనత వారికే దక్కిందని, పదిమంది బాగుకోసం తపనపడే మంచి హృదయం గల వ్యక్తి నిండు నూరేళ్లు చల్లగా జీవించాలని, ఆ భగవంతుని కోరుకుంటున్నట్లు మల్లి బాబు యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న పొంగులేటి అభిమానులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అభిమానులు పొంగులేటికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ధనియాకుల మాధవరావు, కొమ్మినేని శ్రీనివాసరావు, ఉప్పు గండ్ల వీరభద్రం, శీలం పుల్లయ్య, గుగులోతు రవి, చల్ల మల్లయ్య, బండి ఉపేందర్ మొగిలి శ్రీను, జక్కంపూడి వెంకటేశ్వర్లు,బాదావత్ నాగరాజు పల్లపు ప్రతాప్,పాటిబండ్ల ప్రసాద్,అయితన బోయిన విఠల్ రావు, బానోత్ లక్ష్మ, దేరంగుల తిరపయ్య, తురక బిక్షం దేరంగుల రామారావు, ఎస్ కే సొందు, పగిడిపల్లి రాములు తదితరులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

బీసీలకు రాజ్యాధికారం

- మున్నూరు కాపుల హక్కుల పోరాటం.

- మున్నూరుకాపు రాష్ట్ర అధ్యక్షులు పుట్టం పురుషోత్తమరావు



ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 28 (భద్రాద్రిన్యూస్): సామాజికంగా, ఆర్థికంగా, విద్యపరంగా బీసీలను పాలక వర్గాలు అణచి వేస్తున్నాయని మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుట్టం పురుషోత్తమరావు ఆవేదన వ్యక్తంచేశారు.ఖమ్మంలోని మున్నూరుకాపు హాస్టల్ ప్రాంగణం లో బుధవారం జరిగిన జిల్లా కార్యవర్గ,అనుబంధ సంఘాల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగిస్తూ...రాష్ట్రంలో బీసీల ఎడల ప్రభుత్వం అణచి వేసే ధోరణిని అవలంభిస్తోందని విమర్శించారు. ఎన్నికలు వచ్చినప్పుడు బీసీల జపం చేస్తారని,అధికారాన్ని పంచుకునే క్రమంలో తమకు ప్రాతినిధ్యం ఎక్కడ కనిపించడం లేదని అసహనం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 60 శాతం ఉన్న బిసిలలో 22 శాతం మున్నూరుకాపు లు ఉన్నారని తక్కువ శాతంగా ఉన్నారని చూపించే కుట్ర జరగడంపై ధ్వజమెత్తారు.బీసీలను ఓటు బ్యాంకుగా చూసే రాజకీయాలకు ఇకనైనా పాలక వర్గాలు ముగింపు పలకాలని హితవుపలికారు.రాష్ట్ర మంత్రి వర్గంలో ఒక్కరికైనా మున్నూరుకాపు లకు అవకాశం కల్పించక పోవడం తమను అవమానించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓట్లు మావి,కష్టాలు మావి...ప్రజాస్వామ్యం లో మా పాత్ర చైతన్యవంతమైనది.నిర్ణయాధికారంలో మాత్రం జనాభా ప్రతిపాదికన వాటా ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. మున్నూరుకాపు లు ఐక్యతతో ఉండి,బీసీల హక్కుల సాధన కోసం ముందుండి పోరాడాలని పిలుపునిచ్చారు. రాజ్యాధికారం అంటే పదవులు మాత్రమే కాదని,ప్రభుత్వ విధానాల్లో మన గొంతుకను వినిపించడం.బీసీలకు న్యాయం జరిగేలా వ్యవస్థలో ప్రాతినిధ్యం సాధించడమేనని పేర్కొన్నారు.

కార్యవర్గ నిర్ణయాలు...

రానున్న ఎన్నికల్లో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పదవిని బీసీలకు కేటాయించాలి.అందుకు గాను మెజార్టీ డివిజన్లను బిసిలకు కేటాయించాలి.

జిల్లా,మండల,గ్రామీణ స్థాయిలో సంఘాన్ని మరింత బలోపేతం చేయాలి.

యువత,మహిళలు,విద్యార్థులను సంఘా కార్యకలాపాల్లో పాల్గొనేలా చూడాలి.

బీసీ సంఘాల్లో సమన్వయం పెంచి,హక్కుల సాధన కోసం ఉద్యమించాలి.

ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేసేలా కృషి చేయాలి.

భవిష్యత్తులో బీసీ సంఘాలన్నింటితో అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి...బీసీల సమస్యలపై పోరాడాలని తీర్మానించారు.

నవంబర్ 15న ఖమ్మంలోని చెరుకూరి మామిడి తోటలో జరగబోయే మున్నూరుకాపు జిల్లా వన మహా సమారాధనను విజయవంతం చేయాలని తీర్మానంలో పేర్కొన్నారు. జిల్లా గౌరవ అధ్యక్షులు కొత్తా సీతారాములు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల గాంధీ,రాష్ట్ర కార్యదర్శి ఆవుల రామారావు,కోశాధికారి కంచి సత్యనారాయణ,

జిల్లా అధ్యక్షులు శీలంశెట్టి వీరభద్రం,ప్రధాన కార్యదర్శి పసుపులేటి దేవేందర్,మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు పగడాల మంజుల,గౌరవ సలహాదారు పార నాగేశ్వరరావు, పొదిలా రవి కుమార్,పసుపులేటి నాసరయ్య,జిల్లా కోశాధికారి మడూరి పూర్ణచందర్ రావు,జిల్లా యూత్ అధ్యక్షులు తోట రమేష్,పట్టణ అధ్యక్షులు పార ఉదయ్ కుమార్,పట్టణ

కార్యదర్శి తోట వీరభద్రం,గౌరవ అధ్యక్షులు సాయికృష్ణ, మున్నూరుకాపు సంఘం నాయకులు రమాదేవి,వెంకటేశ్వరరావు, ఆళ్ల కృష్ణ,మేకల నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

పాత కక్షలతోనే అఖిల్ హత్య..

- నలుగురు నిందితుల అరెస్ట్!

- సాంకేతిక ఆధారాలతో కేసును ఛేదించిన పోలీసులు

- హత్యకు ఉపయోగించిన కత్తి, సెల్‌ఫోన్లు, రక్తపు మరకలున్న దుస్తులు స్వాధీనం



లక్ష్మీదేవి పల్లి, అక్టోబర్ 28 (భద్రాద్రి న్యూస్): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎదురుగడ్డ గ్రామంలో సంచలనం సృష్టించిన మేడి అఖిల్ హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో పరారీలో ఉన్న నలుగురు నిందితులను అరెస్ట్ చేసి, హత్యకు ఉపయోగించిన ఆయుధాలతో పాటు కీలక ఆధారాలను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఆదేశాల మేరకు టెక్నికల్ టీమ్ సహకారంతో సాంకేతిక ఆధారాలను విశ్లేషించి నిందితులను గుర్తించినట్లు కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ వెల్లడించారు.

బస్‌స్టాండ్ సమీపంలో నిందితుల అరెస్ట్

నమ్మదగిన సమాచారం మేరకు లక్ష్మీదేవిపల్లి ఎస్సై అఖిల తన సిబ్బందితో కలిసి కొత్తగూడెం బస్‌స్టాండ్ సమీపంలో నిందితులు దంత్యాల గణేష్ అలియాస్ గని, సిరిపురం సాత్విక్ అలియాస్ చిన్ను, ముద్దంగుల వెంకటేష్ అలియాస్ చిన్ని, తరాల ప్రదీప్‌లను అదుపులోకి తీసుకున్నారు.

పాత గొడవలు.. పక్కా పథకంతో హత్య

పోలీసుల విచారణలో వెల్లడైన వివరాల ప్రకారం.. గతంలో జరిగిన గొడవలు, వ్యక్తిగత కక్షల నేపథ్యంలో గణేష్, సాత్విక్‌లు అఖిల్‌పై పగ పెంచుకున్నట్లు తెలుస్తోంది. హత్యకు పథకం రచించి, మద్యం తాగిస్తామని నమ్మించి అఖిల్‌ను ఎదురుగడ్డ గ్రామంలోని రేకుల షెడ్డు సమీపంలోని ఖాళీ ప్రదేశానికి తీసుకెళ్లారు. 2026 అక్టోబర్ 19వ తేదీ తెల్లవారుజామున సుమారు 3 గంటల సమయంలో గణేష్ కత్తితో అఖిల్ మెడపై పలుమార్లు పొడిచినట్లు, సిమెంట్ ఇటుకతో ముఖంపై దాడి చేయగా సాత్విక్ కూడా ఇటుకతో దాడి చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఈ దాడిలో అఖిల్ మృతి చెందాడు. ఈ హత్యకు సంబంధించి మిగిలిన ఇద్దరు నిందితులు సైతం ముందస్తు పథకంలో భాగంగా సహకరించినట్లు పోలీసులు గుర్తించారు.

ఫోన్‌పే లావాదేవీలు.. కీలక ఆధారాల స్వాధీనం

హత్యకు ముందు మద్యం కొనుగోలు తదితర అవసరాల కోసం ఫోన్‌పే ద్వారా నగదు లావాదేవీలు జరిగినట్లు విచారణలో గుర్తించారు. నిందితుల వద్ద నుంచి మూడు సెల్‌ఫోన్లు, ఫోన్‌పే లావాదేవీలకు సంబంధించిన స్క్రీన్‌షాట్‌లను స్వాధీనం చేసుకున్నారు. హత్యకు ఉపయోగించిన కత్తి, రక్తపు మరకలు ఉన్న దుస్తులను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు

ఈ సందర్భంగా డీఎస్పీ ఆదినారాయణ మాట్లాడుతూ.. వ్యక్తిగత కక్షలు, పాత గొడవల కారణంగా హింసాత్మక చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. చిన్నచిన్న వివాదాలను పెద్దవిగా చేసుకొని నేరాలకు పాల్పడవద్దని, సమస్యలు తలెత్తినప్పుడు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. నేరాలకు పాల్పడిన వారు ఎంతకాలం పరారీలో ఉన్నా సాంకేతిక ఆధారాల సహాయంతో గుర్తించి చట్టం ముందు నిలబెడతామని స్పష్టం చేశారు. ఈ కేసులో నిందితుల పాత్ర, ఆర్థిక లావాదేవీలు, ఇతరుల ప్రమేయం తదితర అంశాలపై పోలీసులు లోతుగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు. కేసు ఛేదనలో టెక్నికల్ టీమ్ సహకారం కీలకంగా నిలిచిందని డీఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై అఖిల, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థి ప్రతిభ



ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 28 (భద్రాద్రి న్యూస్):- ఢిల్లీ పబ్లిక్ స్కూల్, ఖమ్మం విద్యార్థి డి. ఉపాంశు జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొని పాఠశాలకు గర్వకారణంగా నిలిచాడు. జమ్మూ కాశ్మీర్‌లోని గండేర్‌బల్ జిల్లా గదూరా ప్రాంతంలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ జాతీయ స్థాయి తైక్వాండో మీట్‌లో పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి దుకుపర్తి ఉపాంశు అండర్-17 విభాగంలో 68 కిలోల కేటగిరీలో పాల్గొన్నాడు. ఈ సందర్భంగా విద్యార్థి ఉపాంశుతో పాటు అతని కోచ్ ఎం. సాయి రేఖను పాఠశాల చైర్మన్ కె. రవీందర్ రెడ్డి , డైరెక్టర్ పి. వినీతా రెడ్డి , ప్రిన్సిపాల్ ఎస్.ఎల్. రణధీర్ , ఉపాధ్యాయులు అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, భవిష్యత్తులో మరిన్ని పోటీల్లో పాల్గొని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందిస్తూ, వారి ప్రతిభను ప్రోత్సహించేందుకు పాఠశాల యాజమాన్యం ఎల్లప్పుడూ సహకరిస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

మీనాకు నాట్య కళాశ్రీ అవార్డు



ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 28 (భద్రాద్రిన్యూస్):

ఖమ్మం కు చెందిన నాట్య కళాకారుని మీనాకు నాట్య కళాశ్రీ అవార్డును అందజేశారు. బుధవారం హైదరాబాద్ నిజాంపేట నృత్య కళా వైభవం ఆధ్వర్యంలో ఈ పురస్కారాన్ని అందించారు ఈ కార్యక్రమంలో కళా రత్న సంగీత కళానిధి పాలగుమ్మి రాజగోపాల్ భక్తారాందాస్ ముని మనవడు ప్రముఖ ఆధ్యాత్మిక తత్వవేత్త కంచర్ల నాగేశ్వరావు ఆలమూరు రాజకుమారి ఆలమూరు విజయభాస్కర్ చేతులమీదుగా మీనాకు నాట్య కళాశ్రీ పురస్కారాన్ని మెమెంటో శాలువా తో ఘనంగా సత్కరించారు

ఢిల్లీ నుంచి వచ్చిన సెంట్రల్ టీమ్

- సీతంపేట బంజారా గ్రామంలో క్లీన్ అండ్ గ్రీన్ పరిశీలన

- ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా. సర్పంచ్ జానకి రామ్



సుజాతనగర్ , అక్టోబర్ 28 భద్రాద్రిన్యూస్ : సీతంపేట బంజారా గ్రామంలో స్వచ్ఛ భారత్ మిషన్ లో భాగంగా ఢిల్లీ నుంచి వచ్చిన సెంట్రల్ బృందం సుజాతనగర్ మండలంలో పర్యటించింది. మండలంలోని సీతంపేట బంజారా గ్రామ పంచాయతీని సెంట్రల్ టీమ్ సభ్యులు బుధవారం సందర్శించి క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాలను క్షుణ్ణంగా పరిశీలించారు. గ్రామంలో నిర్మించిన డ్రైనేజీ వ్యవస్థ, ఇంకుడు గుంతలు, వ్యక్తిగత మరుగుదొడ్లు, తడి-పొడి చెత్త సేకరణ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. అలాగే గ్రామ పంచాయతీ పరిధిలో నాటిన మొక్కలు, నర్సరీ, పల్లె ప్రకృతి వనం, వైకుంఠధామం, డంపింగ్ యార్డును సందర్శించారు. గ్రామం క్లీన్ అండ్ గ్రీన్ గా ఉండటం పట్ల సెంట్రల్ టీమ్ సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. గ్రామస్తులకు స్వచ్ఛతపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి డీపీవో అనూష, సుజాతనగర్ ఎంపీడీఓ భారతి, డి ఎల్ పి ఓ ప్రభాకర్, ఎంపీవో గాంధీ, సీతంపేట బంజారా గ్రామ సర్పంచ్ జానకి రామ్, పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామ ప్రజలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు. గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం అభినందనీయమని అధికారులు తెలిపారు. ఇదే స్ఫూర్తితో గ్రామాన్ని మరింత ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని సర్పంచ్ జానకి రామ్ ను అధికారులు కోరారు.

అర్నబ్ తుఫాన్ ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలి

- ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లకు మంత్రి పొంగులేటి ఆదేశాలు

- భారీ వర్షాలు, ఈదురుగాలుల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టండి

- పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని సూచనలు



పాలేరు, అక్టోబర్ 28 (భద్రాద్రి న్యూస్): బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర తుఫాన్ అర్నబ్ ప్రభావంతో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. తుఫాన్ ప్రభావంతో ఈదురుగాలుల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు, నష్టం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

ఈ మేరకు బుధవారం ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్‌తో ఫోన్‌లో మాట్లాడిన మంత్రి.. వాతావరణ పరిస్థితులపై ఆరా తీశారు. రెండు జిల్లాల్లోనూ అప్రమత్తంగా ఉండి, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

తుఫాన్ పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించాలని, సంబంధిత శాఖల అధికారులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ముందస్తు ఏర్పాట్లు చేయాలని, పరిస్థితులకు అనుగుణంగా తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్లకు సూచించారు.

కందులవారి వాగు వద్ద పైపులు మాయం!

- రూ.లక్ష విలువైన పైపులు ఎత్తుకెళ్లారనే ఆరోపణలు
- పంచాయతీ పాలకవర్గం మౌనం ఎందుకు?
అనుమతితో తరలించారా.. లేక అపహరించారా?

భద్రాద్రిన్యూస్ ప్రత్యేక కథనం :

ప్రజల తాగునీటి అవసరాల కోసం ఏర్పాటు చేసిన పైపులు మాయమవడంపై పమ్మి పంచాయతీలో చర్చ మొదలైంది. కందులవారి వాగు వద్ద గతంలో చందాలు వసూలు చేసి ఏర్పాటు చేసిన పైపులు కనిపించకుండా పోయాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. సుమారు రూ.లక్ష విలువైన పైపులు మాయమైనా పంచాయతీ పాలకవర్గం పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చందాలు వసూలు చేసి వేసిన పైపులేవీ?

కోయ వీరయ్య హయాంలో తాగునీటి అవసరాల కోసం కందులవారి వాగు వద్ద పైపులు ఏర్పాటు చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. అయితే ప్రస్తుతం ఆ పైపులు కనిపించకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చందాలు సేకరించి ఏర్పాటు చేసిన పైపులను ఎవరు, ఏ కారణంతో తొలగించారనే విషయం స్పష్టతకు రావాల్సి ఉంది.

అధికార, ప్రతిపక్ష వర్గాల వ్యక్తులపై ఆరోపణలు

పైపుల తరలింపులో అధికార, ప్రతిపక్ష వర్గాలకు చెందిన వ్యక్తుల పాత్ర ఉందని కొందరు ఆరోపిస్తున్నప్పటికీ, ఈ ఆరోపణలకు సంబంధించి స్వతంత్రంగా నిర్ధారణ కాలేదు. పైపులను పంచాయతీ ప్రజాప్రతినిధుల అనుమతితో తరలించారా? లేక ఎలాంటి అనుమతులు లేకుండా తీసుకెళ్లారా? అన్నది విచారణలో తేలాల్సి ఉంది.

వ్యక్తుల పొలాల్లోకి పంచాయతీ పైపులా?

పంచాయతీ నిధులతో ఏర్పాటు చేసిన పైపులను వ్యక్తిగత పొలాలకు తరలించారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అదే నిజమైతే, వాటిని ఎవరి అనుమతితో తరలించారు? ప్రజాధనంతో సమకూర్చిన సామగ్రి వ్యక్తిగత అవసరాలకు వినియోగించారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

విచారణ జరిపి వాస్తవాలు వెల్లడించాలి

ఈ వ్యవహారంపై పంచాయతీ పాలకవర్గం స్పందించి, పైపుల తరలింపునకు సంబంధించిన వివరాలను ప్రజలకు వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, పైపుల ఆచూకీ గుర్తించి, నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు తేలితే బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజల అవసరాల కోసం ఏర్పాటు చేసిన పైపుల విషయంలో నెలకొన్న అనుమానాలకు అధికారులు ఎప్పుడు తెరదించుతారో వేచి చూడాలి.

కరువు రైతులను ఆదుకోవాలి..

- తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలి!
- సాగు చేయని భూములకు ఎకరాకు రూ.30 వేలు, ఎండిన వాణిజ్య పంటలకు రూ.50 వేల పరిహారం ఇవ్వాలి
- కారేపల్లి తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఐక్య రైతు సంఘం ధర్నా

కారేపల్లి, అక్టోబర్ 28 (భద్రాద్రి న్యూస్ రాములు): వర్షాభావ పరిస్థితులతో పంటలు ఎండిపోయి తీవ్ర నష్టాల్లో కూరుకుపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని అఖిలభారత ఐక్య రైతు సంఘం ఖమ్మం జిల్లా కార్యదర్శి కోలేటి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. కారేపల్లి మండలంలో నెలకొన్న కరువు పరిస్థితులపై బుధవారం అఖిలభారత ఐక్య రైతు సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కోలేటి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. కరువు మండలంగా ప్రకటించడంతోనే ప్రభుత్వం తన బాధ్యత ముగిసినట్లు భావించకూడదని, క్షేత్రస్థాయిలో నష్టపోయిన రైతులకు తక్షణ సహాయం అందించాలని అన్నారు. వర్షాలు లేక పంటలు సాగు చేయలేని పరిస్థితి ఏర్పడటంతో పాటు, ఇప్పటికే సాగు చేసిన పంటలు ఎండిపోవడంతో రైతులు తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రైతుల పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన కరువు సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. కరువు ప్రభావంతో ఉపాధి, ఆహార భద్రతకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు రేషన్ దుకాణాల ద్వారా 14 రకాల నిత్యావసర సరుకులను ఉచితంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. వర్షాభావం కారణంగా పంటలు సాగు చేయని భూములకు ఎకరాకు రూ.30 వేల పరిహారం, ఎండిపోయిన వాణిజ్య పంటలకు ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం



అందించాలని కోరారు. బావుల కింద సాగవుతున్న పంటలను కాపాడేందుకు వ్యవసాయానికి కోతలు లేని నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని, అందుబాటులో ఉన్న నీటి వనరులను రైతులకు అందుబాటులోకి తెచ్చి పంటలను రక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతులు పండించిన పంటలకు నష్టం వాటిల్లిన సమయంలో ప్రభుత్వం అండగా నిలవాలని, కరువు పరిస్థితులపై తక్షణమే స్పందించి బాధిత రైతులకు న్యాయం చేయాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ ఖమ్మం డివిజన్ కార్యదర్శి ఝాన్సీ, అఖిలభారత ఐక్య రైతు సంఘం ఖమ్మం డివిజన్ కార్యదర్శి గుగ్గులోతు తేజ నాయక్, పార్టీ మండల కార్యదర్శి గుమ్మడి సందీప్, మండల నాయకులు పులకాని సత్తిరెడ్డి, రాకేష్, సక్రు, రంగయ్య, శ్రీను, అనసూయ, సరోజిని తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటరు నమోదుపై సర్పంచ్‌లు ప్రత్యేక దృష్టి సారించాలి

- గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి అర్హులైన పట్టభద్రులతో ఓట్లు నమోదు చేయించాలి: కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తోటకూరి రాంబాబు

కారేపల్లి, అక్టోబర్ 28 (భద్రాద్రి న్యూస్ రాములు): ఖమ్మం--వరంగల్--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటరు నమోదు కార్యక్రమాన్ని సింగరేణి మండలంలోని సర్పంచ్‌లు, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు, స్థానిక నాయకులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ సింగరేణి మండల అధ్యక్షుడు తోటకూరి రాంబాబు పిలుపునిచ్చారు. ఓటరు నమోదు గడువు నవంబర్ 6తో ముగియనున్న నేపథ్యంలో మిగిలిన సమయంలో అర్హులైన ప్రతి పట్టభద్రుడి ఓటు నమోదు చేయించేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. ఈ సందర్భంగా తోటకూరి రాంబాబు మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో సింగరేణి మండలంలో సుమారు 2,700 పట్టభద్రుల ఓట్లు ఉండగా, ఇప్పటివరకు సుమారు 1,600 ఓట్లు మాత్రమే నమోదయ్యాయని తెలిపారు. దీంతో ఇంకా అనేకమంది అర్హులైన పట్టభద్రులు ఓటరు నమోదుకు దూరంగా ఉన్నారని పేర్కొన్నారు. గడువు సమీపిస్తున్నందున గ్రామస్థాయిలో నాయకులు సమన్వయంతో పనిచేసి, అర్హులైన పట్టభద్రులను గుర్తించి ఓటరు నమోదును వేగవంతం చేయాలని సూచించారు. మండలంలోని సర్పంచ్‌లు, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు, పార్టీ నాయకులు ప్రతి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి పట్టభద్రుల వివరాలను సేకరించాలని, అర్హులైన వారు ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించి సహకరించాలని కోరారు. ఓటరు నమోదు ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా, నవంబర్ 6లోగా అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకునేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. సింగరేణి మండలంలో



పట్టభద్రుల ఓటరు నమోదు శాతం పెంచేందుకు ప్రజాప్రతినిధులు, గ్రామస్థాయి పార్టీ నాయకులు సమష్టిగా కృషి చేయాలని తోటకూరి రాంబాబు కోరారు. అర్హులైన పట్టభద్రులు తమ ఓటు హక్కును నమోదు చేసుకుని, ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ప్రజల భద్రతే ముఖ్యం.. అర్నాబ్ తుఫాన్‌పై ఎమ్మెల్యే రాందాస్ నాయక్ అప్రమత్తత!

- వైరా నియోజకవర్గ ప్రజలు జాగ్రత్తగా ఉండాలి.. భారీ వర్షాల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు పాటించాలి

కారేపల్లి, అక్టోబర్ 28 (భద్రాద్రి న్యూస్ రాములు): బంగాళాఖాతంలో ఏర్పడిన అర్నాబ్ తుఫాన్ ప్రభావంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో వైరా నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి ఒక్కరూ తమ కుటుంబాల భద్రతకు ప్రాధాన్యమివ్వాలని పిలుపునిచ్చారు. భారీ వర్షాలు కురిసే సమయంలో అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లరాదని, వాగులు, వంకలు, చెరువులు, లోతట్టు ప్రాంతాల సమీపంలోకి వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఈదురుగాలులు వీచే సమయంలో చెట్ల కింద, పాత భవనాల సమీపంలో ఉండరాదని, విద్యుత్ స్తంభాలు, తెగిపడిన విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలని సూచించారు. రైతులు వాతావరణ పరిస్థితులను గమనిస్తూ వ్యవసాయ పనుల్లో అప్రమత్తంగా ఉండాలని, పశువులను సురక్షిత ప్రాంతాల్లో ఉంచుకోవాలని తెలిపారు. చిన్నారులు, వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారి పట్ల కుటుంబ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. తుఫాన్ ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని సంబంధిత శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన సహాయక చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. వర్షాల కారణంగా ఎక్కడైనా ప్రజలకు ఇబ్బందులు ఎదురైతే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

ప్రజల ప్రాణాలు, భద్రతే అత్యంత ప్రాధాన్యం :

ప్రజల ప్రాణాలు, భద్రతే తనకు ముఖ్యమని ఎమ్మెల్యే మాలోత్



రాందాస్ నాయక్ పేర్కొన్నారు. తుఫాన్ ప్రభావం తగ్గే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉంటూ అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో నిర్లక్ష్యానికి తావివ్వకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.

వైరాలో ఘనంగా మంత్రి పొంగిలేటి జన్మదిన వేడుకలు

- వైరా నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గరిడేపల్లి కిషోర్ ఆధ్వర్యంలో ఘనంగా మంత్రి పొంగిలేని శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు

వైరా, అక్టోబర్ 28,(భద్రాద్రి న్యూస్) : తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని బుధవారం వైరా నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గరిడేపల్లి కిషోర్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలను వైరాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర మాజీ మార్క్ఫె ఫెడ్ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, వైరా మున్సిపాలిటీ మాజీ చైర్మన్ సూతగాని జైపాల్, జిల్లా కాంగ్రెస్ నాయకులు మిట్టపల్లి నాగి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సీతారాములు, కేక్ కట్ చేసి మంత్రి పొంగలి శ్రీనివాసరెడ్డికి జన్మదిన శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 14వ వార్డు కౌన్సిలర్ ధీరావత్ వెంకటేశ్వర్లు, ఒకటవ వార్డు కౌన్సిలర్ మోరు శ్రీకాంత్, 20వ వార్డు మాజీ కౌన్సిలర్ గుగులోతు లక్ష్మీబాయి, జాలాది రామకృష్ణ, రాచర్ల సత్యం, పర్సా రవి, తెలంగాణ ఎన్ ఎస్ యు ఐ జాయింట్ సెక్రెటరీ వేముల శ్రీనాథ్, గుడికి వెంకన్న, మోదుగు లక్ష్మయ్య, పమ్మిదాసు, జీవరత్నం, రామకృష్ణ, హనుమ, వెంకట్, ఏదునూరి శ్రీను, మహేష్, నాళ్ళ రమేష్, జాకబ్, వాసు రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు గుగులోత్ సాయి, వడ్లమాని నిఖిల్, పటాన్ జాన్ పాషా, సాయి (ఆర్సి) , రాజేష్, బబ్లు, ప్రేమ్, మహేష్, ఆసిఫ్, విజయ్, నాని, చక్రి, ఉపేందర్,



తదితరులు పాల్గొని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.

తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు అండగా ఉంటాం!

- గాడేపాడులో వెంకటేష్--రమ్య దంపతుల దశదిన కార్యక్రమానికి హాజరైన అఖిలపక్ష నాయకులు.. కుటుంబానికి పరామర్శ

కారేపల్లి, అక్టోబర్ 28 (భద్రాద్రి న్యూస్ రాములు): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం గాడేపాడు గ్రామానికి చెందిన మద్దెబోయిన వెంకటేష్--రమ్య దంపతుల దశదిన కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రులిద్దరినీ కోల్పోయిన ఇద్దరు చిన్నారుల పరిస్థితి నాయకులను తీవ్రంగా కలచివేసింది. చిన్న వయసులోనే అమ్మానాన్నలకు దూరమైన చిన్నారుల భవిష్యత్తును తలచుకుని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, చిన్నారులకు మనోధైర్యం కల్పించాలని సూచించారు. తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు సమాజం అండగా నిలవాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు. ఇలాంటి కష్టకాలంలో బాధిత కుటుంబానికి తోడుగా నిలిచి, చిన్నారుల భవిష్యత్తుకు భరోసా కల్పించేందుకు ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో ముందుకు రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ఖమ్మం నగర మాజీ అధ్యక్షుడు పగడాల నాగరాజు యాదవ్, టీడీపీ ఇల్లందు మండల అధ్యక్షుడు పుట్టా ఉపేందర్ యాదవ్, సీపీఎం నాయకుడు కొండెబోయిన నాగేశ్వరరావు యాదవ్, మద్దెబోయిన సత్యనారాయణ యాదవ్ తదితరులు పాల్గొని మృతుల కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.



పాత లింగాలలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు

- ప్రజాసేవలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలి
- రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి మంత్రి నిరంతరం కృషి
- రాంరెడ్డి గోపాల్‌రెడ్డి

కామేపల్లి, అక్టోబరు 28 (భద్రాద్రిన్యూస్): రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నిత్యం ప్రజాసేవలోనే గడుపుతూ నిరంతరం తెలంగాణ సమగ్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలంగాణ రాష్ట్ర అగ్రికల్చర్ కమిషన్ డైరెక్టర్ రాంరెడ్డి గోపాల్‌రెడ్డి కొనియాడారు. తన స్వగ్రామం పాతలింగాల గ్రామంలో బుధవారం అట్టహాసంగా నిర్వహించిన మంత్రి పొంగులేటి జన్మదిన వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజా సంక్షేమానికి నిరంతరం తపించే మంత్రి పొంగులేటి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని, భగవంతుడు ఆయనకు సంపూర్ణ ఆయురారోగ్యాలుఅష్టైశ్వర్యాలు ప్రసాదించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి గింజల నరసింహారెడ్డి, సర్పంచ్‌లు ఇట శ్రీనివాసరావు, కిన్నెర నాగ సుజాత,ఇల్లందు మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాలోత్ భావసింగ్,మాజీ ఎంపీటీసీ నల్లమోతు లక్ష్మయ్యతో పాటు కాంగ్రెస్ నాయకులు తోటకూరి శీను, నల్లమోతు వెంకటనరసయ్య, చామంతుల విశ్వనాథం,హెచ్. బ్రహ్మం,చల్ల సతీష్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి శ్రీరామ్ లైఫ్ భీమా ఆర్థిక భరోసా

- నామిని రేఖకు పది లక్షల రూపాయల చెక్కును అందజేసిన డీజీఎం సతీష్



కామేపల్లి, అక్టోబర్ 28 (భద్రాద్రిన్యూస్): కుటుంబ పెద్దను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న బాధిత కుటుంబానికి శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఆర్థిక భరోసానిచ్చింది. శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఖమ్మం బ్రాంచ్ ఆపద సమయంలో అండగా నిలిచింది. వివరాలు ఇలా ఉన్నాయి. కామేపల్లి మండలంలోని కొత్త లింగాల గ్రామానికి చెందిన తలారి జయ చందర్ ఫిబ్రవరి 9 తేదీ 2022లో శ్రీరాం లైఫ్ ఇన్సూరెన్స్ ఖమ్మం బ్రాంచ్ లో బీమా పాలసీ తీసుకున్నారు. ఆయన అనారోగ్య కారణాలతో సెప్టెంబర్ 2026 లో మృతి చెందారు.దీంతో నిబంధన మేరకు నామిని అయినా తలారి రేఖకు పది లక్షల రూపాయల బీమా చెక్కును శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ వరంగల్ జోనల్ మేనేజర్ గంగుల సతీష్,ఖమ్మం డివిజన్ మేనేజర్ రాజబోయిన భరత్,ఖమ్మం బ్రాంచ్ మేనేజర్ పిన్ని సురేష్ లు బుధవారం అందజేశారు.ఈ సందర్భంగా జరిగిన సభలో డిజిఎం సతీష్ మాట్లాడుతూ ఇంట్లో కుటుంబ పెద్దను కోల్పోయిన సమయంలో లైఫ్ ఇన్సూరెన్స్ ద్వారా లభించే ఆర్థిక సహాయం కుటుంబానికి అండగా నిలుస్తుందని ఆ కుటుంబాన్ని కాపాడుతుందని అన్నారు.ఆపద సమయంలో కుటుంబానికి ఆర్థిక భరోసా ఇస్తుందని తెలిపారు.ప్రతి ఒక్కరు తమ కుటుంబ భవిష్యత్తు,ఆర్థిక భద్రత కోసం తగిన బీమా రక్షణ పొందాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డెవలప్మెంట్ మేనేజర్లు వెంకటకృష్ణ,చిరంజీవి,రమేష్, తిరుపతి,అజార్ తో పాటు కొత్త లింగాల గ్రామపంచాయతీ సర్పంచ్ ఇట్ట శ్రీనివాస్,కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఎడ్లపల్లి శేషగిరిరావు,గ్రామ శాఖ అధ్యక్షులు పగిడిపల్లి కోటయ్య,పండగ కోటేశ్వరరావు, రాజేష్,శ్రీరామ్ డెవలప్మెంట్ ఆఫీసర్లు దారా బెంజిమన్, భూక్యా నాగేశ్వరరావు,కె భవాని,బాసని నాగేశ్వరరావు సేల్స్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బంది ప్రజల క్షేమం కోసం అప్రమత్తంగా ఉండాలి

- కొత్తలింగాల 33/11 కె.వి సబ్‌స్టేషన్ ఆకస్మిక తనిఖీ చేసిన ఏడిఈ యాదిగిరి
- వర్షాలతో ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశం



కామేపల్లి, అక్టోబరు 28 (భద్రాద్రిన్యూస్): తుఫాను ప్రభావంతో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ సిబ్బంది, ఆపరేటర్లు విధుల్లో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ ఏడీఈ ఎం.యాదగిరి ఆదేశించారు. మండలంలోని కొత్తలింగాల గ్రామంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా నిర్వహణ రికార్డులు, లాగ్‌బుక్‌లను పరిశీలించి ప్రాంతీయ విద్యుత్ సరఫరా తీరుపై ఆరా తీశారు. ?అనంతరం ఆయన మాట్లాడుతూ ఈదురుగాలులు, వర్షాల వల్ల స్తంభాలు వాలినా, విద్యుత్ లైన్లు తెగిపడినా తక్షణమే స్పందించి పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు, రైతులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా రక్షణ చర్యలు తీసుకోవాలన్నారుఈ కార్యక్రమంలో కొత్త లింగాల ఏఈ ఎన్.శ్రీనివాసులు, సబ్‌స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇల్లందులో జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సభను విజయవంతం చేయండి





కామేపల్లి, అక్టోబర్ 28 (భద్రాద్రి న్యూస్): ఇల్లందు మార్కెట్ యార్డులో గురువారం మధ్యాహ్నం 3:00 గంటలకు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సభ ను విజయవంతం చేయాలని. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గుజ్జర్లపూడి రాంబాబు బుధవారం ఓ ప్రకటనలో పిలుపు నిచ్చారు. ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అధ్యక్షతన జరిగే ఈ సభకు రాష్ట్ర పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు దేవి ప్రసన్న పట్ట భద్రుల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమరెడ్డి పాల్గొంటారని తెలిపారు. కాంగ్రెస్ జిల్లా నాయకులు వివిధ హోదాలో ఉన్న చైర్మన్లు వైస్ చైర్మన్లు,మండల యూత్ కాంగ్రెస్,ఎన్ ఎస్ యు ఐ,మహిళా కాంగ్రెస్,ఓబీసీ, కిసాన్ కాంగ్రెస్,అధ్యక్షులు,డైరెక్టర్లు, సర్పంచులు,ఉపసర్పంచులు, మండల నాయకులు. గ్రామ శాఖ పార్టీ అధ్యక్షులు,కార్యకర్తలు,పట్టభద్రులు తప్పకుండా హాజరు కావాలని ఆయన కోరారు.

వీసీ సమావేశంలో తక్కెళ్లపాడు సర్పంచ్‌కు మంత్రి సీతక్క అభినందనలు

- వీఓ భవనాలు, షెడ్, గోడౌన్ నిర్మాణ పనులు పూర్తి చేసినందుకు ప్రశంసలు
- సర్పంచ్ ముక్కర రామకృష్ణారెడ్డిని అభినందించిన మంత్రి సీతక్క, కమిషనర్
- పనులు పూర్తయిన 15 రోజుల్లోనే ఖాతాలో బిల్లుల నగదు జమ
- ఇతర గ్రామపంచాయతీల సర్పంచ్‌లు తక్కెళ్లపాడును ఆదర్శంగా తీసుకోవాలని సూచన





ఖమ్మం జిల్లా, ఎర్రుపాలెం మండలం: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను విజయవంతంగా పూర్తి చేసినందుకు ఎర్రుపాలెం మండలం తక్కెళ్లపాడు గ్రామపంచాయతీకి ప్రత్యేక గుర్తింపు లభించింది. ఈరోజు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో తక్కెళ్లపాడు సర్పంచ్ ముక్కర రామకృష్ణారెడ్డిని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, కమిషనర్ అభినందించారు. ప్రభుత్వం మంజూరు చేసిన వీఓ భవనాలు, షెడ్, గోడౌన్ నిర్మాణ పనులను విజయవంతంగా పూర్తి చేసినందుకు ప్రత్యేక ప్రశంసలు లభించాయి. రాష్ట్రంలోని ఇతర గ్రామపంచాయతీల సర్పంచ్‌లు కూడా అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేసి, బిల్లుల చెల్లింపుల ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని, తక్కెళ్లపాడు గ్రామపంచాయతీని ఆదర్శంగా తీసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు.

కొత్తూరు తండాలో ఆధ్యాత్మిక శోభకు స్వాగత తోరణం!

- నేడు శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం వద్ద భూమిపూజ, శంకుస్థాపన.. ముఖ్య అతిథిగా వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్



కారేపల్లి, అక్టోబర్ 29 (భద్రాద్రి న్యూస్ రాములు): ఖమ్మం జిల్లా సింగరేణి మండలం కొత్తూరు తండాలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్యాత్మిక వైభవాన్ని మరింత చాటిచెప్పేలా జాతీయ రహదారి సమీపంలో నూతన స్వాగత తోరణం నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నారు. ఈ సందర్భంగా గురువారం ఉదయం 11.16 గంటలకు భూమిపూజ, శంకుస్థాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ప్రధాన అర్చకులు బానోత్ రవీందర్ గురూజీ, బానోత్ సురేష్ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్ఛారణల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో భాగంగా ఉదయం 9 గంటలకు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, 10 గంటలకు భూమి సూక్త పఠనం, వాస్తు హోమం నిర్వహిస్తారు. అనంతరం ఉదయం 11.16 గంటలకు స్వాగత తోరణానికి భూమిపూజ, శంకుస్థాపన చేసి, మధ్యాహ్నం 12.15 గంటలకు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేయనున్నారు. దేవస్థానానికి వచ్చే భక్తులకు నూతన స్వాగత తోరణం ప్రత్యేక ఆకర్షణగా నిలవడంతో పాటు కొత్తూరు తండా ఆధ్యాత్మిక ప్రాభవానికి ప్రతీకగా నిలవనుంది. ఆలయ అభివృద్ధిలో భాగంగా చేపడుతున్న ఈ కార్యక్రమానికి గ్రామస్థులు, భక్తులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

మధిరలో ఘనంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదిన వేడుకలు

- KVR హాస్పిటల్ ఆవరణలో ఘనంగా కేక్ కటింగ్, తలసేమియా బాధితుల కొరకు భారీ రక్తదాన శిబిరం
- నిర్వహించిన ప్రముఖ వైద్యులు డాక్టర్ కోట రాంబాబు





తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ మరియు సమాచార పౌర సంబంధాల (I&PR) శాఖామాత్యులు, గౌరవనీయులు శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని మధిర పట్టణంలోని KVR హాస్పిటల్ ఆవరణలో జన్మదిన వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమాన్ని KVR హాస్పిటల్ అధినేత, ప్రముఖ వైద్యులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు డాక్టర్ కోట రాంబాబు ఘనంగా నిర్వహించారు. అనంతరం హాస్పిటల్ ఆవరణలో కేక్ కట్ చేసి, నాయకులంతా ఒకరికొకరు కేక్ తినిపించుకుంటూ "శ్రీనన్న నాయకత్వం వర్ధిల్లాలి" అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కోట రాంబాబు గారు మాట్లాడుతూ.. నిత్యం ప్రజాసేవలో నిమగ్నమవుతూ, ప్రజల్లోంచి వచ్చిన నిజమైన ప్రజా నాయకుడిగా, పేదల పెన్నిధిగా నిలిచిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారు రాష్ట్రాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. ప్రతి ఇంట్లో పెద్ద కొడుకులా నిలిచే సీనన్న మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, భగవంతుడు వారికి సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు. అనంతరం KVR హాస్పిటల్ నందు తలసేమియా చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన భారీ రక్తదాన శిబిరాన్ని డాక్టర్ కోట రాంబాబు గారు ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ కోట రాంబాబు మరియు అయిలూరి వెంకటేశ్వర్ రెడ్డి గారు స్వయంగా రక్తదానం చేసి యువతలో గొప్ప ఉత్సాహాన్ని నింపారు. స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేసిన యువకులను, కాంగ్రెస్ శ్రేణులను నేతలు స్వయంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ట్రస్ట్ బోర్డ్ మాజీ చైర్మన్ & డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వర్ రెడ్డి గారు, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి గారు, మధిర టౌన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దేవిశెట్టి రంగారావు గారు, ఎర్రుపాలెం మాజీ జెడ్పీటీసీ అంకశాల శ్రీనివాసరావు గారు, మధిర మాజీ ఎంపీపీ ఎర్రగుంట రమేష్ గారు, మధిర మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ శీలం వీరవెంకటరెడ్డి గారు, అమరవాది సత్యనారాయణరెడ్డి గారు, తక్కెళ్ళపాడు గ్రామ సర్పంచ్ ముక్కర రామకృష్ణారెడ్డి గారు, లక్ష్మీపురం గ్రామ సర్పంచ్ తళ్ళపురెడ్డి నాగిరెడ్డి గారు, నిదానపురం సర్పంచ్ వేంపటి రమేష్ గారు, ఎర్రుపాలెం మాజీ సర్పంచ్ మొగిలి అప్పారావు యాదవ్ గారు, రేమిడిచర్ల మాజీ సర్పంచ్ పురుషోత్తమ రాజు గారు, మీనవోలు ఉప సర్పంచ్ ముక్కర సందీప్ రెడ్డి గారు, తక్కెళ్ళపాడు మాజీ ఉప సర్పంచ్ కూరపాటి రమేష్ గారు, మీనవోలు సొసైటీ అధ్యక్షులు కుడుముల మధుసూదన్ రెడ్డి గారు, జిల్లా రజక సంఘం ప్రధాన కార్యదర్శి తలుపులు విజయ్ బాబు గారు, కాంగ్రెస్ పార్టీ నాయకులు అక్కినపల్లి నాగేశ్వరరావు గారు, సత్యనారాయణ రాజు గారు, బాలకృష్ణ గారు, చిలక రాజేంద్ర గారు, యశోధ , విజయరాణి గారు, మల్లెల లక్ష్మణరావు , బుర్రా నారాయణ , మారపోగు జమలయ్య , వెంకటేశ్వర్ రెడ్డి గారు, జూన్ రెడ్డి , నారాయణ రెడ్డి , ప్రభాకర్ రావు గారు, వెంకటేశ్వరరావు, యూత్ కాంగ్రెస్ శ్రేణులు కూరపాటి వరుణ్ గారు, శీలం ప్రసన్నకుమార్ , గద్దల విజయ్ గారు, గుండ్ల రత్న బాబు, శ్రీనివాస్ రెడ్డి, మహిళలు మరియు సీనన్న అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కూతురే కొడుకై.. కన్నతండ్రికి అంతిమ సంస్కారాలు...

- కంటతడి పెట్టిస్తున్న దృశ్యం
- కుటుంబానికి అండగా నిలిచిన మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి
- రూ.10 వేల ఆర్థిక సాయం అందించిన వీరమల్ల సురేష్‌గౌడ్



మునుగోడు అక్టోబర్ 28 (భద్రాద్రి న్యూస్): మండలంలోని కొంపెల్లి గ్రామంలో హృదయవిదారక ఘటన చోటుచేసుకుంది..కొంపెల్లి గ్రామానికి చెందిన బోయపర్తి మహేందర్ (39) వారం రోజుల క్రితం అనారోగ్యానికి గురయి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేద కుటుంబానికి చెందిన మహేందర్‌కు నలుగురు ఆడపిల్లలు సంతానం. కుటుంబాన్ని పోషిస్తూ బిడ్డల భవిష్యత్తుకు అండగా నిలిచిన ఆయన ఆకస్మిక మరణంతో కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది.బుధవారం నిర్వహించిన అంత్యక్రియల్లో పెద్ద కూతురు సాక్షి తండ్రికి తలకొరివి పెట్టింది. తండ్రిని కోల్పోయిన ఆడబిడ్డలు కన్నీరుమున్నీరుగా విలపించిన తీరు గ్రామస్తులను కలచివేసింది.

– బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత...

మహేందర్ మృతి విషయం తెలుసుకున్న మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం పంపించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మందుల సత్యం మహేందర్ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు.

– ఆర్థిక సాయం అందజేసిన విరమల్ల సురేష్ గౌడ్

కొంపెల్లి గ్రామానికి చెందిన ఆదిత్య ట్రాన్స్‌పోర్ట్ మేనేజింగ్ డైరెక్టర్ వీరమల్ల సురేష్‌గౌడ్ బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు.కుటుంబానికి పెద్ద దిక్కును కోల్పోయిన రోజా, ఆమె నలుగురు ఆడబిడ్డలకు భవిష్యత్తుపై భరోసా కల్పించేందుకు దాతలు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని గ్రామస్తులు, కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఆపదలో ఉన్న ఈ కుటుంబానికి సమాజం అండగా నిలిచి చిన్నారుల భవిష్యత్తుకు చేయూత అందించాలని కోరారు.

మునుగోడు పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్

- నేరాల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలి..
- ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించొద్దు : జిల్లా ఎస్పీ..



మునుగోడు అక్టోబర్ 28 (భద్రాద్రి న్యూస్): నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ మునుగోడు పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీలో భాగంగా సందర్శించి స్టేషన్ పనితీరు, సిబ్బంది విధుల నిర్వహణ, కేసుల దర్యాప్తు పురోగతిని సమీక్షించారు. పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న ఎస్పీ గారికి సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. అనంతరం స్టేషన్ పరిసరాలు, రిసెప్షన్ కౌంటర్, రికార్డుల నిర్వహణ, సిబ్బంది విధుల వివరాలు, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించి పోలీస్ స్టేషన్ నిర్వహణపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడికి న్యాయం జరుగుతుందనే నమ్మకం కల్పించేలా సిబ్బంది పనిచేయాలని సూచించారు. బాధితుల సమస్యలను ఓపికగా విని, ఫిర్యాదులపై చట్టప్రకారం తక్షణ చర్యలు తీసుకోవాలని, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ పోలీస్ శాఖ ప్రతిష్టను పెంపొందించాలని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో ప్రతి పోలీస్ అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.అదేవిధంగా మునుగోడు పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసులు, దర్యాప్తులో ఉన్న కేసులు, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను సమీక్షించారు. కేసుల దర్యాప్తులో జాప్యం జరగకుండా సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి కేసులో శాస్త్రీయ పద్ధతులను అనుసరిస్తూ అవసరమైన సాక్ష్యాధారాలను సేకరించాలని సూచించారు. నేరస్థులకు శిక్ష పడేలా పకడ్బందీగా దర్యాప్తు పూర్తి చేసి, నిర్దిష్ట గడువులో చార్జిషీట్లు దాఖలు చేయాలని ఆదేశించారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి కార్యాచరణ రూపొందించి నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై నిరంతర నిఘా ఉంచాలని, పాత నేరస్తులు, రౌడీషీటర్లు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి కదలికలను పర్యవేక్షించాలని ఎస్పీ సూచించారు. గ్రామాల్లో బీట్ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తూ ప్రజలతో నిరంతరం సంబంధాలు కొనసాగించాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపించినప్పుడు స్థానిక ప్రజలు పోలీసులకు సమాచారం అందించేలా అవగాహన కల్పించాలని తెలిపారు. రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌ను పటిష్టం చేసి దొంగతనాలు, ఇతర నేరాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగం వంటి కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, యువత మాదకద్రవ్యాలకు బానిస కాకుండా గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల ప్రజలను అప్రమత్తం చేస్తూ, ఆన్‌లైన్ మోసాలు, నకిలీ లింకులు, అనుమానాస్పద ఫోన్ కాల్స్ ద్వారా జరిగే మోసాలపై విస్తృతంగా ప్రచారం చేపట్టాలని తెలిపారు. మహిళలు, బాలికల భద్రత విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని, మహిళలపై నేరాలకు సంబంధించిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి బాధితులకు అండగా నిలవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, హెల్మెట్ ధరించడం, మద్యం సేవించి వాహనాలు నడపకపోవడం, అతివేగాన్ని నియంత్రించడం వంటి అంశాలపై ప్రజలకు వివరించాలని తెలిపారు.పోలీస్ స్టేషన్‌లోని క్రైమ్ రికార్డులు, కేసు డైరీలు, జనరల్ డైరీ, ఎఫ్ఐఆర్ రిజిస్టర్లు, కోర్టు కేసుల వివరాలు, ఇతర ముఖ్యమైన రికార్డులను పరిశీలించి వాటిని ఎప్పటికప్పుడు నవీకరించాలని సూచించారు. విధుల నిర్వహణలో క్రమశిక్షణ, సమయపాలన పాటిస్తూ ప్రతి అధికారి తనకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని తెలిపారు.నేరాల నివారణ, శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా మునుగోడు పోలీస్ స్టేషన్ పరిధిలోని అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ ఆదేశించారు. ఈ వార్షిక తనిఖీలో జిల్లా ఎస్పీ గారి వెంట నల్లగొండ చండూర్ సీఐ రాము, డీసీఆర్‌బీ సీఐ శ్రీను నాయక్, మునుగోడు ఎస్ఐ శోభన్ బాబు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదిన వేడుకలు

- జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు ఆరెం రవి దొర
- గ్రామ సర్పంచ్ ఆరెశీ అచ్చమ్మ





కామేపల్లి, అక్టోబర్ 28 (భద్రాద్రి న్యూస్): ఖమ్మం జిల్లా ఇల్లందు నియోజకవర్గం లోని కామేపల్లి మండలం పరిధిలో గల కెప్టెన్ బంజారా గ్రామంలో గ్రామ సర్పంచ్ ఆరెం అచ్చమ్మ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు మిఠాయిలు పంచి టపాసులు పేలిచి సంబరాలు చేసుకుని రాష్ట్ర మంత్రి కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. పొంగులేటి శీనన్న ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవిస్తూ ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ పవన్ కళ్యాణ్. ఎం.అరుణ. కె.సునీత.కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కాసిం గ్రామ పెద్దలు, గ్రామస్తులు యువకులు కార్యకర్తలు అభిమానులు ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

www.bhadradrinews.com
భద్రాద్రి న్యూస్ తెలుగు దినపత్రిక
Bhadradrinews Telugu Daily

పండితాపురంలో ఘనంగా పొంగులేటి జన్మదిన వేడుకలు

- భారీ కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిన
- జిల్లా డిసిసిబి డైరెక్టర్ మాజీ జడ్పిటిసి మల్లిబాబు యాదవ్.
- కొమ్మినేపల్లి సొసైటీ చైర్మన్ ధనియాకుల హనుమంతరావు







కామేపల్లి, అక్టోబర్ 28 (భద్రాద్రి న్యూస్):-
రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి జన్మదిన వేడుకలు మండలంలోని పండితాపురం పశువుల సంత లో పొంగులేటి ప్రధాన అనుచరుడు డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్. ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బారీ కేక్ కట్ చేసి స్వీట్స్, మిఠాయిలు పంచుకొని టపాసులు పిలిచి ఆనందోత్సవాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మల్లి బాబు యాదవ్. కొమ్మినేపల్లి సొసైటీ చైర్మన్ ధనియాకుల హనుమంతరావు మాట్లాడుతూ మాట ఇస్తే తప్పకుండా ఆరు నూరైనా పిలిస్తే ఎక్కడ ఉన్నా నేనున్నానంటూ వచ్చే మంచి మనసున్న పొంగులేటి శీనన్నకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుకుంటున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో కీలకంగా ఉంటూ పేద ప్రజల సంక్షేమం కోసం ఇందిరమ్మ ఇండ్లు, రైతుల కోసం భూభారతి లాంటి ఎన్నో వినూత్న పథకాలు తీసుకొచ్చి అమలు చేస్తున్న ఘనత వారికే దక్కిందని పదిమంది బాగుకోసం తపనపడే మంచి హృదయం గల వ్యక్తి నిండు నూరేళ్లు చల్లగా జీవించాలని,ఆ భగవంతుని కోరుకుంటున్నట్లు మల్లి బాబు యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న పొంగులేటి అభిమానులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అభిమానులు పొంగులేటికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కొమ్మినేపల్లి సర్పంచ్ ధారావత్ అనురాధ, ఉపసర్పంచ్ మేకల మల్లికార్జునరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ధనియాకుల మాధవరావు, మేకపోతుల మహేష్. కొమ్మినేని శ్రీనివాసరావు, ఉప్పు గండ్ల వీరభద్రం,శీలం పుల్లయ్య, గుగులోతు రవి, చల్లా మల్లయ్య, బండి ఉపేందర్, మొగిలి శ్రీను, జక్కంపూడి వెంకటేశ్వర్లు, బాదావత్ నాగరాజు,పల్లపు ప్రతాప్,పాటిబండ్ల ప్రసాద్,ఐతనబోయిన విఠల్ రావు, బానోత్ లక్ష్మ, దేరంగుల తిరపయ్య,తురక బిక్షం,దేరంగుల రామారావు,ఎస్ కే సొందు,పగిడిపల్లి రాములు తదితరులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

మూసీ సుందరీకరణ విషయంలో భూ నిర్వాసితుల తోఅభిప్రాయ సేకరణ







అభిప్రాయ సేకరణ కార్యక్రమానికి వస్తున్న వస్తున్న పలువురు నాయకుల అరెస్ట్

అరెస్ట్ అయిన వారిలో ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్, ఎమ్మెల్యే డి సుధీర్ రెడ్డి, నాయకులు పి కార్తీక్ రెడ్డి

బుద్వేల్, అక్టోబరు 28 :

మూసీ సుందరీకరణ సందర్భంగా భూములు కోల్పోతున్నవారికి న్యాయం చేసేలా చూస్తానని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ తెలిపారు. బుధవారం రాజేంద్రనగర్ లోని వాటర్ అండ్ లాండ్ మేనెజ్మెంట్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (వాలంతరి) లో మూసీ నిర్వాసితులతో మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ కార్పోరేషన్ లిమిటెడ్ (ఎంఆర్డీసీఎల్) అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్డీసీఎల్ మేనెజింగ్ డైరెక్టర్ ఇ.వి నర్సింహ్మారెడ్డి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ పి గౌతమి, ఎక్జిక్యూటీవ్ డైరెక్టర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి, చీఫ్ ఇంజనీర్ కె సురేశ్ కుమార్ తదితరులతో పాటు మూసీ నిర్వాసితులు పాల్గొన్నారు. సమావేశ వివరాలను రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ వెల్లడించారు. మూసీ సుందరీకరణ లో భూములు, ఇండ్లు కోల్పోతున్న వారికి ఎలాంటి నష్టం కలుగకుండ వారికి కావాల్సిన నష్టపరిహారం ఇప్పించడంలో మ ందుండి పనిచేస్తానన్నారు. కొందరు భూ నిర్వాసితులు భూమికి బదులు భూమి అడిగారని, వారి విన్న పాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగేలా చూస్తానన్నారు. మూసీలో ఇండ్లు కట్టుకున్న వారికి నష్టపరిహారం ఇప్పిస్తామన్నారు. మూసీ సుందరీకరణ విషయంలో రాజకీయాలు వద్దన్నారు. మూసీ బఫర్ జోన్ లో ఉన్న భూములను మాత్రమే తీసుకోవాలని చాలా మంది సూచనలు చేశారని, ఈ విషయాన్ని కూడా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తామన్నారు.

మూసీ సుందరీకరణ అభిప్రాయ సేకరణ సమావేశానికి వస్తున్న పలువురు నాయకుల అరెస్ట్ :

మూసీ సుందరీకరణ విషయంలో వాలంతరి లో బుధవారం జరిగిన అభిప్రాయ సేకరణ కార్యక్రమానికి వస్తున్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే డి సుదీర్ రెడ్డి, శాసనమండలి సభ్యులు దాసోజు శ్రావణ్, బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జి పి కార్తీక్ రెడ్డి లను రాజేంద్రనగర్ డీసీపీ ఎస్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు అరెస్ట్ చేశారు. బీఆర్ఎస్ నేత పి కార్తీక్ రెడ్డి స్కూటర్ పై, ఆటో పై వాలంతరి వద్దకు చేరుకున్నప్పటికి ఆయన ను రాజేంద్రనగర్ ఏసీపీ తుల శ్రీనివాస్, ఇన్స్ పెక్టర్ వెంకటేశ్ లు అరెస్ట్ చేసి రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ కు, అక్కడి నుంచి కంచన్ బాగ్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. శాసనమం డలి సభ్యులు దాసోజు శ్రావణ్ ను మానస హిల్స్ వద్ద అరెస్ట్ చేసి కంచన్బాగ్ కు తరలించగా, ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డిని అరెస్ట్ చేసి మైలార్దేవుపల్లి పోలీసు స్టేషన్ లో పెట్టారు.

అభిప్రాయ సేకరణకు వస్తే అరెస్ట్ చేస్తారా : పి కార్తీక్ రెడ్డి

మూసిలో భూములు, ఇండ్లు కోల్పోతున్న వారు అభిప్రాయ సేకరణకు వస్తే అరెస్టు చేయడం ఎంత వరకు సమంజసం అని బీ ఆర్ ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జీ పి కార్తీక్ రెడ్డి పోలీసులను ప్రశ్నించారు. మమ్మల్ని ఎందుకు అరెస్ట్ చేస్తున్నారని ఆయన అక్కడున్న రాజేంద్రనగర్ ఏసీపీ తుల శ్రీనివాస్ ను ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా మూసీ నిర్వాసితుల తో అభిప్రాయ సేకరణ అంటు బాధితులను, వారి పక్షాన మాట్లాడే వారిని సమావేశానికి రానివ్వక పోవడం ఎంత వరకు న్యాయమన్నారు. మూసీ బాధితులకోసం ఎంత వరకైనా వెళ్తామన్నారు.

ముందస్తు అరెస్ట్ లు :

వాలంతరి లో జరుగుతున్న మూసీ సుందరీకరణ, భూ సేకరణ కోసం నిర్వహించిన అభిప్రాయ సేకరణ నేపధ్యంలో రాజేంద్రనగర్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేసి పలు పోలీస్ స్టేషన్లలో ఉంచారు. అరెస్టయిన వారిలో కొలన్ సుబాష్ రెడ్డి , ఎస్ వెంకటేశ్, అక్కెం రాఘవేందర్ యాదవ్, శీలం తిరుపతి రెడ్డి, ఎర్రోళ్ల యాదయ్య, నోముల రాము యాదవ్, పి జీవన్ దాస్, మైసిరెడ్డి, వాసు, లక్ష్మీరాజ్, ఎడ్లకాడి సూర్యం తో పాటు పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

బాధితులు లేకుండ అభిప్రాయ సేకరణ జరిపిస్తారా ?

హైదరాకోట్, హిమాయత్ సాగర్ , దర్గాఖలీజ్ ఖాన్, కొత్వాల్ గూడ ప్రాంతాలకు చెందిన మూసి బాధితులమైన మేకు లేకుండానే భూనిర్వాసితుల అభిప్రాయ సేకరణ జరిపించడం బాధాకరమని ఆయా ప్రాంతాలకు చెందిన విశాలి, ఉమ, రేణుకారెడ్డి, హసన్ బిన్ అబ్దుల్లా, చిన్ను లు వాపోయారు. అభిప్రాయ సేకరణ కార్యక్రమం ఉందని తెలిసి వాలంతరి వద్దకు వస్తే పోలీసులు అడ్డుకుంటున్నారన్నారు.









ప్రజా పంపిణీ వ్యవస్థలో బియ్యం సరఫరా, పంపిణీ సకాలంలో పూర్తి చేయాలి

ప్రతిరోజూ బియ్యం నిల్వల వివరాలు తప్పనిసరిగా నవీకరించాలి

ఎంఎల్ఎస్ పాయింట్ల ఇన్‌చార్జులకు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. చంద్రారెడ్డి ఆదేశాలు

ఎల్‌నినో ప్రభావంతో బియ్యానికి పెరిగే డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని ముందస్తు ప్రణాళిక

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు.. ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తాం

రంగారెడ్డి జిల్లా, అక్టోబర్ 28



రంగారెడ్డి జిల్లా ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా బియ్యం సరఫరా, పంపిణీ ప్రక్రియను సజావుగా నిర్వహిస్తూ, ప్రజలకు సకాలంలో బియ్యం అందేలా చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. చంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు.బుధవారం అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. పాయింట్ల నుంచి బియ్యం తరలింపు ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించిన సరఫరా, పంపిణీ కార్యక్రమాల్లో ఎలాంటి జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బియ్యం తరలింపును నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం నిర్వహిస్తూ, సంబంధిత రేషన్ దుకాణాలకు సకాలంలో బియ్యం చేరేలా తరలించిన సరుకు, మిగిలిన నిల్వల వివరాలను ఎప్పటికప్పుడు సరిచూసుకోవాలని తెలిపారు. స్టాక్ వివరాలు, రికార్డులు, వాస్తవ నిల్వల మధ్య ఎలాంటి వ్యత్యాసాలు ఉండకూడదని, ప్రతి రోజు నిల్వల వివరాలను సమగ్రంగా నిర్వహించాలని సూచించారు.ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావం కారణంగా రానున్న రోజుల్లో బియ్యానికి డిమాండ్ పెరిగే అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.ప్రజా పంపిణీ వ్యవస్థలో ఎలాంటి అక్రమాలకు, అవకతవకలకు తావివ్వకూడదని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. బియ్యం నిల్వలు, తరలింపు, పంపిణీ విషయంలో నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, రికార్డుల నిర్వహణలో పారదర్శకత ఉండాలని సూచించారు. బియ్యం పక్కదారి పట్టించడం, స్టాక్ వివరాల్లో తప్పుడు నమోదు చేయడం, పంపిణీ ప్రక్రియలో అక్రమాలకు పాల్పడడం వంటి చర్యలను తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించారు.జిల్లాలోని అన్ని ఎంఎల్ఎస్ పాయింట్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించనున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. తనిఖీల సమయంలో బియ్యం నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, సరఫరా, పంపిణీ వివరాలను పరిశీలిస్తామని పేర్కొన్నారు. నిబంధనల ఉల్లంఘన, స్టాక్ వివరాల్లో వ్యత్యాసం లేదా అక్రమాలు గుర్తించినట్లయితే సంబంధిత బాధ్యులపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజా



మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

బుద్వేల్, అక్టోబరు 28:

మహిళలకు కుట్టు లో శిక్షణ ఇప్పించి వారి కాళ్ల మీద వారు నిలబడటానికి ప్రోత్సహిస్తున్న స్నేహాంజలి వెల్ఫేర్ అకాడమీ చేస్తున్న కృషి అభినందనీయమని రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ బి సురేందర్ రెడ్డి, డిప్యూటీ ప్రాజెక్టు ఆఫీసర్ స్వాతి లు అన్నారు. స్నేహాంజలి వెల్ఫేర్ అకాడమి అధ్యక్షురాలు పచ్చ అనిత ఆధ్వర్యంలో నెల రోజుల పాటు రాజేంద్రనగర్ ఏవీఎం హై స్కూల్ లో కరస్పాండెంట్ అక్తర్ షరీఫ్ సహకారంతో 18 మంది మహిళలకు నిర్వహించిన ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమంలో శిక్షణ పొందిన మహిళలకు బుధవారం సర్టిఫికెట్లను బహుకరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ కమిషనర్ బి సురేందర్ రెడ్డి, డిప్యూటీ ప్రాజెక్టు ఆఫీసర్ స్వాతి లు మాట్లాడుతూ, ఒక మహిళ ఆర్థిక స్వేచ్ఛ సాధిస్తే ఆ కుటుంబానికి మేలు జరుగుతుందన్నారు. కుట్టు శిక్షణ నేర్చుకున్న మహిళలు స్వయం శక్తిపై ముందుకు సాగుతు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పచ్చ నర్సింగ్ రావు, క్రాంతి వర్మ, నాగేందర్, కె వరలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు గెలుచుకున్న ఉద్యోగులు

క్రీడా పోటీలలో గెలుపొందిన ఉద్యోగులకు అభినందనలు

రాజేంద్రనగర్, అక్టోబరు 28 :

తెలంగాణ ట్రాన్స్కో, డిస్కం ల ఆధ్వర్యంలో పురుషులు, మహిళ ఉద్యోగులకు సాంస్కృతిక, క్రీడల పోటీలు నిర్వహించారు. భువనగిరి లో జరిగిన ఈ పోటీలలో టీజీఎస్పీడీసీఎల్ సెంట్రల్ సర్కిల్ ఉద్యోగులు ఎంఎస్ మధురాచార్యులు (పాటల పోటీల్లో రెండు బహుమతులు), పి అరవిందో (మోనో యాక్షన్, ఒక బహుమతి), టి అనురాధ (నృత్యం), కె రవీందర్ రాజు (ఫ్యాన్సీ డ్రెస్), జి రంజన్ బాబు(పాటలు, ఫ్యాన్సీ డ్రెస్, రెండు బహుమతులు) ప్రతిభ చాటి బహుమతులను గెలుచుకున్నారు. ఈ సందర్భంగా విద్యుత్ సెంట్రల్ సర్కిల్ ఎస్ ఇ రమేష్ పోటీలలో ప్రతిభ చాటిన ఉద్యోగులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఉద్యోగ జీవితంలో ఎన్నో ఒత్తిళ్ల నుంచి ఉపశమనం కలిగించటానికి ఇలాంటి పోటీలు ఎంతో దోహదపడతాయన్నారు. విధి నిర్వహణతో పాటు ఉద్యోగులు వివిధ రంగాలలో రాణించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘం నేత, పోటీల ఇంచార్జ్ పి శ్రీనివాస్, మేనేజర్ సంపత్ రెడ్డి లు పాల్గొన్నారు.

పదేళ్లు అధికారంలో ఉండి ఏం చేశారు?

హుడా ట్రక్ పార్క్ స్థలంపై ఎమ్మెల్యే కృష్ణారావు మొసలి కన్నీరు

దయార్‌గూడ అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్ హామీ ఏమైంది?

ప్రజా ఆస్తులు ప్రజలకే దక్కాలి.. ప్రకటనలు కాదు, సమాధానం చెప్పాలి

ఎమ్మెల్యే తీరుపై నిప్పులు చెరిగిన కాంగ్రెస్ నేతలు నాగిరెడ్డి, మేకల రమేష్

కూకట్‌పల్లి, అక్టోబర్ 28:



గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో నింపాదిగా కాలం గడిపిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు.. ఇప్పుడు అకస్మాత్తుగా కూకట్‌పల్లి అభివృద్ధి, ప్రజా అవసరాలు గుర్తుకురావడం విడ్డూరంగా ఉందని కాంగ్రెస్ నాయకులు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. హుడా ట్రక్ పార్క్ స్థలంలో క్రికెట్, ఇండోర్ స్టేడియాలు, పార్క్ నిర్మించాలని ఇప్పుడు డిమాండ్ చేస్తున్న ఎమ్మెల్యే.. దశాబ్ద కాలం పాటు అధికారంలో ఉండి ఆ దిశగా ఎందుకు చర్యలు తీసుకోలేదో ముందు ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పాలని వారు నిలదీశారు.

హామీలు గాలికి.. మాటలు కోటలకు

కాంగ్రెస్ ఏ బ్లాక్ అధ్యక్షుడు డాక్టర్ పి. నాగిరెడ్డి, కూకట్‌పల్లి డివిజన్ మాజీ అధ్యక్షుడు మేకల రమేష్ ఈ మేరకు ఎమ్మెల్యే తీరుపై నిప్పులు చెరిగారు. దయార్‌గూడలో దళితుల కోసం అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్ నిర్మిస్తానని గతంలో ఇచ్చిన హామీ ఏమైందని వారు ఘాటుగా ప్రశ్నించారు. కూకట్‌పల్లి డివిజన్‌లో క్రీడా మైదానాలు, పార్కుల అభివృద్ధిపై ఎందుకు నోరు మెదపడం లేదని నిలదీశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి, ఇప్పుడు ప్రతిపక్షంలో కూర్చున్నాక మొసలి కన్నీరు కార్చడం ఎమ్మెల్యే ద్వంద్వ వైఖరికి నిదర్శనమని వారు విమర్శించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో క్రీడాకారులను, యువతను తీవ్రంగా మోసం చేశారని ఆరోపించారు.

ప్రకటనలు కాదు.. జవాబుదారీతనం కావాలి

హుడా ట్రక్ పార్క్ స్థలాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజా అవసరాలకే కేటాయించాలని, ప్రజా ఆస్తులు ప్రజలకే దక్కాలని కాంగ్రెస్ నేతలు స్పష్టం చేశారు. కూకట్‌పల్లి అభివృద్ధి విషయంలో ఇక్కడి నుంచి ఎన్నికైన ప్రతి ప్రజాప్రతినిధి జవాబుదారీగా ఉండాల్సిందేనని తేల్చిచెప్పారు. ప్రజలకు కావాల్సింది పూటకో రంగు మార్చే పసలేని రాజకీయ ప్రకటనలు కాదని, అభివృద్ధి పనులు, ఇచ్చిన హామీల అమలుపై స్పష్టమైన సమాధానాలని డాక్టర్ నాగిరెడ్డి, మేకల రమేష్ ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు హితవు పలికారు.